తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELTEL/2016/68867

తెలంగాణ శాసనసభ
TELANGANA SHASANA SABHA
తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 212 | ఎడిటర్ పాలగోని రాజేష్ | 17 శుక్రవారం జనవరి 2025 | పెజీలు 8 వెల 4

# నాకు సొంతంగా ఇల్లు,కారు లేదు

ఆస్తుల వివరాలు వెల్లడించిన కేజ్రీవాల్



2

# డాకింగ్ ప్రక్రియ విజయవంతం : ఇస్రో

డాకింగ్ స్టంట్‌లో సక్సెస్‌తో నాలుగో స్థానంలో ఇండియా

2035లోగా స్పేస్ స్టేషన్ నిర్మించాలని ఇండియా ప్లాన్

2040 నాటికి చంద్రమండలానికి మనుషులపై పంపాలని యోచన



# నీట్ యూజి పరీక్షలపై కేంద్రం కీలక నిర్ణయం

ఒకే రోజు.. ఒకే షిఫ్టులో పరీక్షల నిర్వహణ

పెన్-పేపర్ పద్ధతిలోనే నిర్వహించనున్నట్లు ప్రకటన




న్యూఢిల్లీ,జనవరి16

దేశవ్యాప్తంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ యూజీ పరీక్షలు నిర్వహణపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెన్-పేపర్ పద్ధతిలోనే నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దేశమంతా ఒకే రోజు.. ఒకే షిఫ్టులో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. కేంద్ర విద్య, ఆరోగ్యశాఖల మధ్య సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం చివరకు ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపింది. 'నేషనల్ మెడికల్ కమిషన్ నిర్ణయం ప్రకారం.. నీట్ యూజీ పరీక్ష పెన్, పేపర్ పద్ధతిలో నిర్వహిస్తాం. ఒకేరోజు, ఒకే షిఫ్టులో ఈ పరీక్ష ఉంటుంది' అని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారి వెల్లడించారు. దేశంలో అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యే పరీక్షగా నీట్ యూజీ నిలుస్తోంది. 2024లో 24లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. జేఈఈ మెయిన్ తరహాలోనే ఈసారి (2025) కూడా నీట్ యూజీని ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని ఎన్‌టీఏ భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ ఛైర్మన్‌గా నియమించిన నిపుణుల కమిటీ సైతం ఆన్‌లైన్ విధానం (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ - అః÷ు)లో నీట్ నిర్వహించాలని సిఫారసు చేసింది. అయితే, తాజాగా కేంద్ర విద్య, ఆరోగ్యశాఖలు జరిపిన విస్తృత చర్చల్లో ఓఎంఆర్ పద్ధతికే మొగ్గుచూపుతూ నిర్ణయం తీసుకున్నారు.



# తెలంగాణ సాకారంలో జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయం

జయంతి సందర్భంగా సిఎం రేవంత్ నివాళి

న్యూఢిల్లీ,జనవరి16

ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ సూదిని జైపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో సాధారణ పల్లె నుంచి ఢిల్లీ దాకా సాగిన ఆయన ప్రస్థానంలో నైతిక విలువలకు కట్టుబడ్డారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో, పార్లమెంట్ ఉభయ సభల్లో బలమైన గళం వినిపించారని సీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, బెల్లంపల్లి, పరిగి ఎంఎల్ఏలు గడ్డం వినోద్, రామ్మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాయకులు రోహిన్ రెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

# ముగిసిన కెటిఆర్ ఇడి విచారణ

7గంటలపాటు విచారించిన అధికారులు

నిధుల మళ్లింపుపైనే అధికారుల దృష్టి

హైదరాబాద్,జనవరి16

ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణ ముగిసింది. దాదాపు 7 గంటల పాటు అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు. హెచ్ఎండీఏ ఖాతా నుంచి విదేశీ సంస్థకు నిధుల బదిలీపై ఈడీ అధికారులు ఆరా తీసినట్టు సమాచారం. విదేశీ సంస్థకు రూ.45.7 కోట్ల బదిలీ వ్యవహారంపై ప్రధానంగా ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఈడీ అధికారులు విచారించారు. ఫార్ములా-ఈరేస్‌లో నిబంధనల ఉల్లంఘనపై ఏసీబీ దర్యాప్తు చేస్తుండగా.. ఇందులో ఆర్బీఐ అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధుల చెల్లింపుపై ఈడీ మరో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ విచారణ నేపథ్యంలో ఈడీ కార్యాలయానికి పెద్దసంఖ్యలో భారాస కార్యకర్తలు చేరుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. సుమారు 200 మంది పోలీసులు అక్కడ మోహరించారు.



బాష్పవాయువు, వాటర్‌కెనాన్ల వాహనాలను పోలీసులు తెప్పించారు. ఉదయం 10.40 గంటల నుంచి ఈడీ అధికారులు కేటీఆర్‌ను విచారించారు. ఈ నేపథ్యంలో ఈడీ కార్యాలయానికి భారాస ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, బాల్క సుమన్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో పలువురు భారాస నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈడీ ఆఫీసు వైపు వచ్చే వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. కార్యాలయం నుంచి వెళ్లిపోవాలని భారాస కార్యకర్తలకు సూచించారు.

# ఢిల్లీ పర్యటనలో బిజీగా సిఎం రేవంత్

-కేంద్రమంత్రులతో వరుస భేటీలు

-అటవీభూముల బదలాయింపుపై బూపేంద్రయాదవ్‌తో ప్రస్తావన

2



# 18న ఎపికి అమిత్ షా రాక

రెండ్రోజుల పర్యటించనున్నట్లు వెల్లడి

అమరావతి,జనవరి16

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల 18వ తేదీన రాబోతున్నారని గురువారం బిజెపి ప్రకటించింది. ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా 18వ తేదీ రాత్రి ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ఆ రోజు రాత్రి ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అవుతారని.. అనంతరం విజయవాడలోని హోటల్లో బస చేయనున్నారు. 19వ తేదీన కృష్ణా జిల్లా, గన్నవరం సమీపంలో నిర్మించిన ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం ప్రాంగణాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు.



# మెచ్చుకోలు ప్రకటను మానండి

అభివృద్ధి లక్ష్యంగా వాస్తవ దృష్టితో పనిచేయండి

అధికారులకు మంత్రి సీతక్క సూచనలు



2

# ఢిల్లీ పర్యటనలో బిజీగా సిఎం రేవంత్

న్యూఢిల్లీ,జనవరి16(ఆర్ఎన్ఎ): ఢిల్లీ పర్యటనలో కేంద్ర మంత్రులు భూపేందర్ యాదవ్, కుమారస్వామితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. రీజనల్ రింగ్ రోడ్, పర్యాటక శాఖకు సంబంధించి కొన్ని అటవీ భూముల నుంచి అభివృద్ధి పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే పంపించిన ప్రతిపాదనలను..వారితో చర్చించారు. ఇప్పటికే పంపించిన ప్రతిపాదనలను వెంటనే క్లియర్ చేయాలని భూపేందర్ యాదవ్‌ను సీఎం రేవంత్, మంత్రి కొండా సురేఖ కోరారు. దీనికి భూపేంద్ర యాదవ్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకి అవకాశాలు, భారీ పరిశ్రమలకు సంబంధించి ప్రోత్సాహకాల కోసం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామిని కోరినట్టు తెలుస్తోంది.కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తో భేటీ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఇకపోతే పెట్టుబడులే లక్ష్యంగా సీఎం రేవంత్ బృందం విదేశాల్లో పర్యటించనుంది. ముందుగా సింగపూర్‌కి వెళ్తారు. మూడు రోజుల పాటు అక్కడ పర్యటిస్తారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను సందర్శిస్తారు. నైపుణ్య అభివృద్ధికి సంబంధించిన కోర్సులు, విధానాలపై అధ్యయనం చేస్తారు. తెలంగాణలో నూతనంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కోసం సింగపూర్ ఐటీఈతో ఒప్పందం చేసుకోనున్నారు. అలాగే సింగపూర్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్‌కి ఆ .. రివర్ ఫ్రంట్ అభివృద్ధి మోడల్‌ను అనుసరించేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు.

# మెచ్చుకోలు ప్రకటను మానండి

ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ మంత్రుల మెప్పుకోసం వాస్తవాలను దాచి పెట్టొద్దు, శాఖపరంగా వాస్తవాలనే నివేదించాలి, అధికారులు, అమాత్యులు వేర్వేరు కాదు, మీరు పొరపాట్లు చేసి మమ్మల్ని ఇబ్బందుల పాలు చేయొద్దు..ఎవరూ తప్పులు చేయొద్దు, జైలు పాలు కావద్దు' అని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క అధికారులను సున్నితంగా హెచ్చరించారు. అధికారులంతా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా పని చేయాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి సీతక్క మాట్లాడుతూ అధికారులు నిబద్ధతతో పనిచేసి శాఖ గౌరవాన్ని నిలబెట్టాలన్నారు. శాఖకు వన్నె తెచ్చేలా పనిచేయాలని సూచించారు. కింది ఉద్యోగులతో సంప్రదింపులు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ బిల్లుల చెల్లింపు పక్రియ ప్రారంభమైందని తెలిపారు. రూ.300 కోట్ల ఎన్ఆర్ఈజీఏ బిల్లులను నిన్న విడుదల చేశామని మంత్రి సీతక్క వెల్లడించారు. అలాగే మల్టీ పర్పస్ వర్కర్ల వేతన బకాయిలను కూడా విడుదల చేశామని తెలిపారు.పంచాయతీరాజ్ శాఖ తరహాలోనే ప్రతి విభాగంలో ఉద్యోగ సమస్యలను ఆన్‌లైన్‌లో పరిష్కరించే విధానాన్ని అవలంబించాలని అన్నారు. అర్హులైన ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారికి పోషకాహారం అందించాలని సూచించారు. ఆ దిశలో జిల్లా సంక్షేమ అధికారులను సిద్ధనీ చేయాలని మంత్రి సీతక్క చెప్పారు. అంగన్వాడీ సేవలపై చిన్నారుల తల్లిదండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని అన్నారు. ప్రతి నెలలో ఒకసారి ఫోన్ ఇన్ విత్ పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మంత్రి చెప్పారు. తల్లిదండ్రుల అభిప్రాయాల మేరకు అంగన్వాడీ సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్వాడీకి వచ్చే గర్భిణులు కింద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి ఇబ్బందులను తొలగించే విధంగా అంగన్వాడి కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేయాలని సూచించారు. దివ్యాంగుల పరికరాల కోసం తెలంగాణ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోని డ్రైవ్ నిర్వహించి దివ్యాంగులకు పరికరాలను అందజేస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి దివ్యాంగులకు పరికరాలను అందజేస్తామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చివరి త్రైమాసికంలో ఉన్నందున బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించుకునే విధంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరక్టర్ డా.సృజన, తదితరులు పాల్గొన్నారు.

# ఆనాటి ఫిరాయింపులపై ఎందుకు మాట్లాడరు

## -హరీష్ రావు తీరుపై మండిపడ్డ బల్మూరి వెంకట్

హైదరాబాద్,జనవరి16

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడేందుకు హరీష్ రావుకు కొంచెమన్నా సిగ్గుండాలని హరీష్ రావుపై ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఫైర్ అయ్యారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు మీరు చేసిన పార్టీ ఫిరాయింపులు, విలీనాలు మర్చిపోయారా అని నిలదీశారు. హరీష్ రావు గతంలో చేస్తున్న దానికి ఇప్పుడు చేస్తున్నాదానికి ఏమైనా పొంతన ఉందా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఏడుగురు శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటించాలని హరీష్ రావు అంటున్నారు.. మరీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి ఇతర పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ఆయన ఎందుకు మాట్లాడలేదని సూటిగా ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయంలో ప్రతిపక్షం లేకుండా చేసి మీ పార్టీలో విలీనం చేసుకుని.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ దాఖలు చేయడంపై మండిపడ్డారు. కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలను చేర్చుకుని ఆరోజు ప్రజా స్వామ్యాన్ని ఖూనీ చేసింది మీరు కాదా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తోన్న సంక్షమే పథకాలను తెలంగాణ ప్రజలు హర్షిస్తుంటే చూసి తట్టుకోలేకపోతున్నారని బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పరిపాలనను మీరు.. మీ బీఆర్ఎస్ పార్టీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తే.. ప్రజా ప్రభుత్వాన్ని బలపరచాలని మీ పార్టీ ఎమ్మెల్యేలు మా కాంగ్రెస్?లో చేరుతున్నారని అన్నారు.

# ఘనంగా ప్రభల తీర్థం

కోనసీమ,జనవరి16

:కపిలేశ్వరపురం మండలంలోని మాచర పంచాయతీ శివారు శ్రీరామపురం చెరువు వద్ద, కోరుమిల్లి ఏటి గట్టు వద్ద, పడమర కండ్రిక పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద, గురువారం ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించారు. .సంక్రాంతి వేడుకల్లో చివరి రోజైన ముక్కనుమ సందర్భాన్ని పురస్కరించుకొని కపిలేశ్వరపురం, టేకి, మాచర, శ్రీరామపురం, అంగర తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా ఉత్సవ మూర్తులతో అలంకరించిన ప్రభలను శ్రీరామపురం చెరువు వద్దకు చేర్చి తీర్థం నిర్వహించారు .అధిక సంఖ్యలో మహిళలు, యాత్రికులు, పాల్గొని స్వామివారికి నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు .అనంతరం గ్రామాల్లో ప్రభలను ఊరేగి స్తూ యాత్రికులు నుంచి నైవేద్యాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ,అధిక సంఖ్యలో మహిళలు, పాల్గొన్నారు .

# బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్ దుర్మార్గం

## మండలి ప్రతిపక్ష నేత మధుసుదనాచారి

హైదరాబాద్,జనవరి16 : బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్ దుర్మార్గమని మండలి ప్రతిపక్ష నేత మధుసుదనాచారి అన్నారు. ఈడీ విచారణకు హాజరైన కేటీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా న్యాయం, ధర్మం బీఆర్ఎస్ పక్షాన ఉందని పేర్కొన్నారు. తప్పుడు కేసులతో బీఆర్ఎస్ పోరాటాన్ని ఆపలేరన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

కాగా, బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసుల జులుంపై బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్ కుమార్, ఫ్లలె రవికుమార్ మండిపడ్డారు. ఈడీ విచారణకు హాజరైన కేటీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన మాపై పోలీసులు ప్రవర్తించిన తీరు సరిగా లేదన్నారు. శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే అక్రమ అరెస్టులు ఏంటని ప్రశ్నించారు. పోలీసులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. అలాగే బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈడీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. ఈడీ కార్యాలయం వద్ద అరెస్టు చేసిన పలువురు బీఆర్ఎస్ నేతలను కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిలో పల్లెరవికుమార్ గౌడ్, క్రిశాంక్, సుమిత్రానంద్, పావని గౌడ్, కీర్తిలత గౌడ్, తదితరులు ఉన్నారు.

# ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు మృగ్యం

## మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీలో బట్టబయలు

ఏలూరు,జనవరి16

ఏలూరు ఆస్పత్రిలో సౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. రోగులు ఇక్కట్లు పడుతున్నా పట్టింపు లేదు. తాజాగా మంత్రి నాదెండ్ల మనోహర్ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేయగా, ఇదే విసయం బయటపడింది. మంత్రి అక్కడి రికార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రిలో సౌకర్యాలు, సేవలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య కళాశాల స్థాయిలో సౌకర్యాలు లేవని అసహనం వ్యక్తం చేశారు. రోగులను తీసుకెళ్లేందుకు వీల్‌ఛైర్లు కూడా లేకపోవడం దారుణమన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. శౌచాలయాల నిర్వహణ దారుణంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని.. లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

# కుంభమేళాలో శ్రీవారికి నిత్యపూజలు

## -దశాశ్వమేధ ఘాట్ వద్ద తిరుమంజనం




తిరుమల,జనవరి16 :

ప్రపంచంలోనే అతిపెద్ద ధార్మిక సమ్మేళనమైన మహా కుంభ మేళాలో ప్రయాగ్ రాజ్ లోని దశాశ్వమేధ ఘాట్ వద్ద గురువారం స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని తితిదే ఘనంగా నిర్వహించింది. తిరుమల శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చకుల బృందం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాసస్వామివారికి స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని పవిత్ర గంగా నది ఒడ్డున కన్నుల పండువగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన స్నపన తిరుమంజనం స్థానిక భక్తులను భక్తి పారవశ్యానికి లోను చేసింది. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీ సూక్తం, భూసూక్తం, నీలా సూక్తం, పురుష సూక్తం, నారాయణ సూక్తం, మొదలైన పంచ సూక్తాలను అర్చకులు వల్లించారు. అభిషేకానంతరం తులసి మాలలతో ఉత్సవ మూర్తులను అలంకరించారు. సహస్రధారాపాత్రతో అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదనంతరం శ్రీ చక్రతాళ్వార్‌నుమంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ గంగా నదిలోకి తీసుకువెళ్లారు. అక్కడ శ్రీ చక్రతాళ్వార్ కు ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించి చక్రస్నాన మహోత్సవాన్ని నిర్వహించారు.

# డాకింగ్ ప్రక్రియ విజయవంతం : ఇస్రో

హైదరాబాద్, జనవరి 16 (ఆర్ఎన్ఎ): ఇస్రో ప్రయోగించిన రెండు ఉపగ్రహాలు గురువారం అంతరిక్షంలో అనుసంధానం అయ్యాయి. స్పేడెక్స్ డాకింగ్ ప్రక్రియ విజయవంతమైనట్లు ఇవాళ ఇస్రో ప్రకటించింది. ఇది చరిత్రాత్మక సందర్భమని ఇస్రో తన ట్వీట్‌లో వెల్లడించింది. సుమారు 15 మీటర్ల దూరం నుంచి 3 మీటర్ల దూరం వరకు రెండు శాటిలైట్లను తీసుకువచ్చేందుకు ఇస్రో పలు ప్రయత్నాలు చేపట్టింది. రెండు సార్లు డాకింగ్ ప్రాసెస్‌ను వాయిదా కూడా వేసింది. కానీ గురువారం ఆ ప్రక్రియను విజయవంతంగా ముగించింది. డాకింగ్ స్టంట్‌లో సక్సెస్ కావడంతో.. ఆ ప్రక్రియను చేపట్టిన నాలుగవ దేశంగా ఇండియా నిలిచింది. భారత ప్రధాని మోదీ.. ఇస్రో టీమ్‌కు కంగ్రాట్స్ కూడా తెలిపారు. డిసెంబర్ 30వ తేదీన 220 కేజీల బరువున్న రెండు శాటిలైట్లను నింగిలోకి పంపింది ఇస్రో. 450 కిలోమీటర్ల దూరంలో ఉన్న కక్ష్యలోకి ఆ ఉపగ్రహాలు వెళ్లాయి. ఆ తర్వాత ఆ రెండు ఉపగ్రహాలను అనుసంధానం చేసేందుకు ఇస్రో ప్రయత్నాలు చేపట్టింది. తొలుత జనవరి 7, ఆ తర్వాత జనవరి 9వ తేదీల్లో డాకింగ్ ప్రాసెస్‌కు ప్రయత్నించింది. కానీ రెండు ప్రయత్నాలను వాయిదా వేయాల్సి వచ్చింది. ఇంతకీ డాకింగ్ ఎలా చేస్తారో తెలుసుకుందాం. వేగంగా వెళ్తున్న రెండు స్పేస్‌క్రాఫ్ట్‌లను.. ఒకే కక్ష్యలో దగ్గరకు తీసుకువస్తారు. మాన్యువల్‌గా లేదా ఆటోమెటిక్‌గా ఆ ప్రక్రియను చేపడుతారు. ఆ తర్వాత రెండు ఉపగ్రహాలు లేదా స్పేస్‌క్రాఫ్ట్‌లు.. అంతరిక్షంలో ఒక్కటవుతాయి. ఆ అనుసంధాన ప్రక్రియను డాకింగ్ అని పిలుస్తారు. ఒకవేళ భారీ పేలోడ్లను నింగిలోకి ఒకేసారి మోసుకెళ్లలేని పక్షంలో.. వేర్వేరు పేలోడ్లతో వెళ్లిన ఉపగ్రహాలను, స్పేస్‌క్రాఫ్ట్‌లను నింగిలో డాకింగ్ చేస్తారు. 2035లోగా స్పేస్ స్టేషన్ నిర్మించాలని ఇండియా భావిస్తున్నది. 2040లోగా మనుషుల్ని చంద్రుడిపై పంపే యోచనలో కూడా ఉన్నది. అయితే ఆ లక్ష్యాలు నిజం కావాలంటే, వాటికి అనువైన వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కొనేందుకు ఇస్రో ప్రయోగాలు చేపడుతున్నది. కీలకమైన టెక్నాలజీపై దృష్టి పెట్టింది. హెవీ రాకెట్ల ద్వారా మోసుకెళ్లే పేలోడ్లను .. అనుసంధానం చేయాలంటే డాకింగ్ ప్రక్రియ కీలకమైంది. అయితే ఆ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఇస్రో ఈ ప్రయోగం చేపట్టినట్లు తెలుస్తోంది. చంద్రయాన్4 ప్రాజెక్టులో భాగంగా చంద్రుడి మీద నుంచి శ్యాంపిళ్లను తెచ్చేందుకు ఇస్రో ప్లాన్ చేసింది. అయితే దానికి కూడా డాకింగ్ సామర్థ్యం అవసరం ఉంటుంది. శాటిలైట్లు అనుసంధానం అయిన తర్వాత ఒక్కటి అవుతాయి. వాటి మధ్య ఎలక్ట్రికల్ పవర్ షేర్ అవుతుంది. ఆ తర్వాత ఇస్రో శాస్త్రవేత్తలు రెండు శాటిలైట్లకు కమాండ్లు పంపిస్తారు. ఒకవేళ కమాండ్లు సక్సెస్ అయితే, ఆ తర్వాత స్పేస్‌క్రాఫ్ట్ అన్‌డాక్ అవుతుంది. రెండేళ్ల పాటు అంతరిక్ష పరిశోధనలు జరుగుతాయి. సాధారణంగా అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌కు రెగ్యులర్‌గా డాకింగ్ ఉంటుంది. ఆస్ట్రోనాట్లు వచ్చి వెళ్తున్న ప్రతిసారి.. స్పేస్ స్టేషన్‌తో స్పేస్‌క్రాఫ్ట్ అనుసంధానం జరుగుతూనే ఉంటుంది. డాకింగ్ టెక్నాలజీలో భారత్ తన సామర్థ్యాన్ని పెంచుకుంటే, భవిష్యత్తు ప్రయోగాలు మరింత సులువు కానున్నాయి. 1966లో అమెరికా తొలిసారి జెమిని8 స్పేస్‌క్రాఫ్ట్‌ను.. ఎజెనా స్పేస్‌క్రాఫ్ట్‌తో డాకింగ్ చేసింది. 1967లో కాస్మోస్ 186, కాస్మోస్ 188 స్పేస్‌క్రాఫ్ట్‌లను ఆటోమెటిక్ డాకింగ్ చేసింది. 2011లో టియాంగ్‌గాంగ్ స్పేస్ ల్యాబ్‌తో షెన్‌జౌ8 స్పేస్‌క్రాఫ్ట్‌ను చైనా విజయవంతంగా డాకింగ్ చేసింది.

# నాకు సొంతంగా ఇల్లు, కారు లేదు

ఢిల్లీ, జనవరి 16 :

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ న్యూ ఢిల్లీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తన ఆస్తుల వివరాలను వెల్లడించారు. తనకు సొంతంగా ఇల్లు, కారు లేదని కేజ్రీ ప్రకటించారు. తాను 14 క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నట్లు వెల్లడించారు. తనకు మొత్తం రూ.1.73 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రస్తుతం తన చేతిలో రూ.40,000 నగదు, తన భార్య సునీత కేజ్రీవాల్ చేతిలో రూ.32,000 నగదు ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా తన భార్య సునీత మొత్తం ఆస్తుల విలువ రూ.2.5 కోట్లుగా పేర్కొన్నారు. అందులో రూ.25 లక్షల విలువైన 320 గ్రాముల బంగారంతోపాటు రూ.92 వేల విలువైన కేజీ వెంటి ఉన్నట్లు వెల్లడించారు. ఇక సునీతకు గురుగ్రామ్‌లో ఇల్లు, ఒక మారుతి సుజుకి బెలెనో (2017 మోడల్) కారు ఉన్నట్లు తెలిపారు. దంపతులిద్దరి ఆస్తుల విలవ రూ.4.23 కోట్లుగా ప్రకటించారు.

# సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పార్టీ రెండు పిటిషన్లు దాఖలు

న్యూఢిల్లీ,జనవరి 16

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పార్టీ రెండు పిటిషన్లు దాఖలు చేసింది. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన 9 నెలలు అవుతున్నా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ పేర్కొంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, మహిపాల్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని కోర్టుకు బీఆర్ఎస్ తెలిపింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది. గతంలో కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోర్టును బీఆర్ఎస్ కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు వచ్చిందని గుర్తు చేసింది. మేఘా చంద్ర కేసు తీర్పుకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని బీఆర్ఎస్ తెలిపింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది.

# మాజీ మంత్రి జ్యోతిప్రియాకు బెయిల్ మంజూరు

కోల్‌కతా,జనవరి 16

పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి జ్యోతిప్రియా మాలిక్‌కు కోల్‌కతాలో మనీల్యాండరింగ్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ప్రజా పంపిణీ స్కీమ్‌లో జరిగిన స్కామ్‌లో 14 నెలలుగా మాలిక్ జైలుశిక్ష అనుభవించారు. 50 లక్షల వ్యక్తిగత పూచీకత్తు, ఇద్దరు 25వేల బాండ్‌పై సాక్షి సంతకాలు చేసిన తర్వాత బెయిల్ మంజూరీ చేశారు. 2023 అక్టోబర్ 27వ తేదీన మాలిక్‌ను ఈడీ అరెస్టు చేసింది. రేషన్ షాపులకు పంపిన ఆహారధాన్యాలను.. అక్రమమార్గంలో దారి మళ్లించి, వాటిని మార్కెట్‌లో అమ్ముకున్నట్లు మాజీ మంత్రి మాలిక్‌పై ఆరోపణలు ఉన్నాయి. 2023, డిసెంబర్ 12వ తేదీన మాలిక్‌పై ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణకు సహకరించాలని మాలిక్‌కు కోర్టు చెప్పింది. ప్రతి రోజు కోర్టుకు హాజరుకావాలని పేర్కొన్నది. మొబైల్ నెంబర్ ఇవ్వాలని, పాస్‌పోర్టును సరెండర్ చేయాలని ఆదేశించింది. సాక్ష్యులను ప్రభావితం చేయరాదు అని పీఎంఎల్‌ఏ కోర్టు హెచ్చరించింది. ఆహార, సరఫరాల శాఖకు 2011 నుంచి 2021 మధ్య మాలిక్ మంత్రిగా చేశారు.

## సంపాదకీయం

# కలవర పెడుతున్న కల్తీ ఆహారం !

గురువారం 16-1-2025

భోజన ప్రియులు పెరిగారు. ఇంటివంటకన్నా బయట బిర్యానీలు, కరీలకు ప్రాముఖ్యం పెరిగింది. అలాగే కరీపాయింట్స్ పెరిగాయి. రుచికరమైన హోటళ్లు..అమ్మచేతి వంట అంటూ ప్రచారం సాగిస్తున్నాయి. కానీ ఇలాంటి అనేక హోటళ్లలో పరిశుభ్రత డొల్ల అని ఇటీవల అధికారుల వరుస దాడలతో బట్టబయలు అయ్యింది. పరిశుభ్రత, నాణ్యత అన్నవి పక్కకు పోయాయి. ప్రపంచవ్యాప్తంగా మాంసాహార ప్రియులే ఎక్కువగా ఉంటారు. శాఖాహారం కన్నా మాంసాహారాన్నే చాలా మంది ఇష్టంగా ఆరగిస్తుంటారు.ఆదివారం వచ్చిందంటే చాలు చికెన్ లేదా మటన్ తెచ్చుకోవాల్సిందే. అమ్మ లేదా భార్యతో రుచికరంగా వండించుకుని తినాల్సిందే. ఇటీవల కాలంలో హోటళ్లు విపరీతంగా పెరిగిపోయాయి. స్విగ్గీ, జొమాటో వంటి ఆన్ లైన్ ఎ÷-లాట్ ఫామ్స్ వచ్చిన తర్వాత ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారి సంఖ్య బాగా పెరిగిపోతోంది. ఒక్క క్లిక్‌తో బిర్యానీ ఇంటి ముందుకే రావడంతో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆర్డర్ పెట్టుకుని తినేస్తున్నారు. అయినా ఆదివారం రోజును అంతా ఎంతో ప్రత్యేకంగా భావిస్తారు. ఆ రోజు ఇంట్లో కచ్చితంగా నాన్ వెజ్ ఉడకాల్సిందే. లేదంటే ఏదో వెలితిగా అనిపిస్తుంటుంది. రోజు కచ్చితంగా నాన్ వెజ్ తినాల్సిందే అనే విధంగా పరిస్థితి తయారయ్యింది. ఇదే అదనుగా అనేకులు హోల్ బిజినెస్ రంగంలోకి దిగారు. రుచికరమైన, శుచికరమైన వంట అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ బొద్దింకలు, వెంట్రుకుల, మేకులు, జెర్రీలు ఇలా ఒకటేమిటి రకరకాల వస్తువులు , ప్రాణులు బిర్యానీల్లో దర్శనమిస్తున్నాయి. మాంసాహార ప్రియులకు ఆదివారం ప్రత్యేకమైన రోజు. చాలా దేశాల ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు స్థానిక చట్టాల ప్రకారం తమ ఉద్యోగులకు వారానికి ఓ రోజు ఇవ్వాల్సిన సెలవు దినాన్ని ఆదివారంగా ఎంచుకున్నారు. వారం మొత్తం కష్టపడి పని చేసిన ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడి, శరీర అలసటతో ఉంటారు. ఆ ఒక్కరోజు మాత్రం కుటుంబసభ్యులతో ఆనందంగా గడుపుతుంటారు. అయితే మానవజాతి ఆవిర్భావం నుంచి నాన్ వెజ్ తినడానికే మనిషి ఎక్కువగా ఇష్టపడుతుంటాడు. అయితే ఆదివారం రోజున తమ కుటుంబసభ్యులతో కలిసి సరదాగా గడిసే సమయంలో మాంసాహారం ఉంటే ఇంక ఆ మజానే వేరుగా ఉంటుంది. అందుకే ఆదివారం రోజున చికెన్, మటన్, చేప వంటి మాంసాహారాలు తినేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. అలాగే పిల్లలు కూడా పాఠశాలలు, కళాశాలలకు వెళ్తూ వారం మొత్తం బిజీబిజీగా ఉంటారు. ఆ ఒక్కరోజే ఇంటి వద్ద ఉంటారు. అందుకే ఈ రోజున నాన్ వెజ్ తినేందుకు ఎక్కువగా మంది మొగ్గు చూపుతుంటారు. ఈ క్రమంలో ఆదివారాలు హోటళ్లకు గిరాకీ పెరుగుతోంది. సంప్రదాయమే కాలక్రమేనా సంస్కృతిగా మారి పోయింది. ఆదివారం మాంసాహారం తినని కుటుంబం అంటూ ఉండదు. దాదాపు ప్రతిఒక్కరూ ముక్క లేనిదే ముద్ద దిగదు అన్నట్లు ఆదివారాన్ని ప్రత్యేకంగా చూస్తారు. ఆ రోజు నాన్ వెజ్ తీసుకురాకపోతే పిల్లలు పెద్ద యుద్ధమే చేస్తుంటారు. దీంతో ఆదివారం నాన్ వెజ్ తినడం తప్పని సరిగా మారిపోయింది. అందుకే ఆదివారం నాడు చికెన్, మటన్ షాపుల ముందు ప్రజలు పెద్దఎత్తున బారులు తీరుతుంటారు. అదేరీతిలో హోటళ్లు కూడా కిక్కిరిసి పోతున్నాయి. ముందే ఆర్డర్ ఇవ్వడం, రిజర్వ్ చేసుకోవడం తప్పనిసరిగా మారింది. అయితే ఎంతో పేరు ప్రఖ్యాతులు ఉన్న హోటళ్లు కూడా శుచి, శుభ్రత, నాణ్యత విషయంలో డొల్ల అని తేలింది. వారి కిచెన్‌లను పరిశీలించినప్పుడు పాచిపోయిన, కాలం చెల్లిన పదార్థాలు దర్శనం ఇస్తున్నాయి. హోటళ్లు, ఫుట్‌పాత్‌లపై నోరూరించే, ఘుమ ఘుమలాడే వంటకాల వెనక అనేక నాసిరకం ఆహార పదార్థాలు దాగి ఉంటున్నాయి. కనీస ప్రమాణాలు పాటించకుండా మాంసాహారాన్ని నిల్వ ఉంచుతున్నారు. వాటికే రంగులద్ది మళ్లీ మళ్లీ నూనెలో వేయించి,వేడివేడిగా పొగలు కక్కిస్తూ వడ్డిస్తున్నారు. పలు చోట్ల రోగాల బారిన పడిన జంతువుల మాంసాన్ని సైతం వినియోగించిన ఘటనలు వెలుగు చూశాయి. నాసిరకం నూనెలు, అనుమతి లేని రంగులను మితిమీరి వాడుతున్నారు. కల్తీ ఆహారం వల్ల అతిసారం నుంచి క్యాన్సర్ల వరకు దాదాపు 200 రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు, నరాలు, ఎముకలు, మూత్రపిండాలు, మెదడు, చర్మ సంబంధిత సమస్యలు వస్తాయని పేర్కొంటున్నారు. ఆహార పదార్థాల తయారీలో రుచి, రంగు కోసం హానికరమైన రసాయనాలు, రంగులను కలుపుతుండడంతో దేశంలో సుమారు 10 కోట్ల మంది వివిధ వ్యాధులతో బాధ పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 2030 నాటికి ఈ సంఖ్య 15 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. వంట నూనెల నియంత్రణ చట్టం-1947, నిత్యావసర సరకుల నియంత్రణ చట్టం-1955, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం-1992 వంటివి క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలుకు నోచుకోవడంలేదు. ఆహారం కల్తీ చేయటం, నాసిరకం పదార్థాలు అమ్మటం నేరమని ఆహార భద్రతా ప్రమాణాల చట్టం-2006 చెబుతున్నది. ఆహార కల్తీ నిరోధక చట్టం-1954 కఠిన శిక్షలను నిర్దేశిరచింది. ఆహార, పానీయాలను కల్తీ చేసి అమ్మేవారికి ఆరు నెలల తప్పనిసరి జైలు శిక్షతో పాటు రూ.25 వేల జరిమానా విధించాలని పార్లమెంటరీ ప్యానెల్ సైతం ఏడాది క్రితం సిఫారసు చేసింది. అయితే హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేస్తూ.. కలుషిత ఆహారాన్ని గుర్తిస్తున్నా.. వారికి శిక్షలు మాత్రం పడడం లేదు. జరిమానాలతో బయటికొచ్చి మళ్లీ అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం నాసిరకం ఆహారం అని తేలితే జాయింట్ కలెక్టర్ సమక్షంలో నేరస్తుడిని ప్రవేశపెట్టి జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష వేసే అవకాశం ఉంది. సబ్ స్టాండర్డ్ కేసుల్లో రూ.వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకూ జరిమానా చెల్లించి నేరస్తులు బయట పడుతున్నారు. కల్తీ ఆహారం అని తేలితే క్రిమినల్ కేసు బుక్ చేయాలి. వారికి గరిష్టంగా రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఒకవేళ కల్తీ ఆహారం తిని ఎవరైనా చనిపోయినట్లు నిరూపించగలిగితే గరిష్టంగా ఏడేళ్ల శిక్ష విధించేందుకు చట్టంలో సెక్షన్లున్నాయి. ఇన్ని శిక్షలున్నా కల్తీ నిరా ఘాటంగా జరిగిపోతూనే వుంది. కల్తీ ఆహారానికి సంబంధించి ప్రభుత్వాలు కదలాలి. నిఘా పెరగాలి. తనిఖీ నిరంతరం కొనసాగాలి. కల్తీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజలలో సైతం చైతన్యం పెరగాలి. అప్పుడే ఈ కల్తీకి క్లళెం వేయగలం అని గుర్తించాలి. అందుకే భోజన ప్రియులు ఇవన్నీ గుర్తించి తినడం మంచిది. లేకుంటే లేని రోగాలను, క్యాన్సర్‌లను కొని తెచ్చుకోవడం జరుగుతుంది.

# ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్న ప్రయాగ్‌రాజ్

## మహాకుంభమేళాలలో భారీగా తరలివస్తున్న భక్తులు
## భక్తులకు ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం ఏర్పాట్లు

ప్రయాగ్‌రాజ్,జనవరి16

భారీగా తరలివస్తున్న భక్తులతో త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ కొనసాగుతోంది. భక్తుల భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ మార్మోగుతోంది. మహాకుంభమేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూపీ ప్రభుత్వం.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సారి మహా కుంభమేళాకు 40కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది.ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా మూడో రోజుకు చేరుకుంది. ఈ మహాకుంభమేళాకు తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ భక్త జనసంద్రాన్ని తలపిస్తోంది. మహాకుంభమేళాకు నాలుగోరోజు కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు కొనసాగుతున్నాయి. నదీమతల్లికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన ఆధ్యాత్మిక పండుగ మహా కుంభ్ ఈసారి సంగం నగరం ప్రయాగ్‌రాజ్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. లక్షలాది సంవత్సరాల క్రితం కుంభం నుండి జారిన అమృతాన్ని వెతుక్కుంటూ గంగా-యమునా, అదృశ్య సరస్వతి ఒడ్డుకు భక్తులు గుంపులు గుంపులుగా పెద్ద ఎత్తున తరలి వస్తారు. మకర సంక్రాంతి రోజున అంటే మంగళవారం నాడు 3.5 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సంఖ్య నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే ప్రపంచంలోని 234 దేశాల్లో కేవలం 45 దేశాల్లో మాత్రమే 3.4 కోట్లకు పైగా జనాభా ఉంది. అంటే 189 దేశాల జనాభా కంటే పెద్ద జనసమూహం ఒకేసారి సామూహిక స్నానానికి సంగం నగరికి చేరుకుంది. ఇది దేవుని పట్ల ప్రజలకు ఉన్న నిజమైన విశ్వాసాన్ని తెలియజేస్తుంది. మకర సంక్రాంతి రోజున, భక్తులు గంగలో స్నానమాచరించిన వెంటనే, కుంభం నుండి అమృతం చిందినట్లు త్రివేణి సంగమం చుక్కలు చిమ్మడం ప్రారంభించాయి. వివిధ అఘోరాలకు చెందిన సాధువులు మంగళవారం మహాకుంభంలో మొదటి 'అమృత స్నాన్' తీసుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద జనం భారీగా తరలివచ్చారు. మహా కుంభ్‌లోని చాలా అఘోరాలకు బూడిద ధరించిన నాగ సాధువులు నాయకత్వం వహించారు. వారు తమ క్రమశిక్షణ, సాంప్రదాయ ఆయుధాలపై పట్టుతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నైపుణ్యంతో ఈటెలు, కత్తులు పట్టుకోవడం నుండి ఉద్వేగభరితంగా డ్రమ్ములు వాయించడం వరకు, వారి ప్రదర్శనలు పురాతన సంప్రదాయాల ఉత్సాహభరితమైన వేడుక అని అధికారిక ప్రకటన తెలిపింది. మహాకుంభ్‌లో పురుష నాగ సాధువులే కాకుండా, పెద్ద సంఖ్యలో మహిళా నాగ సన్యాసులు కూడా అమృత స్నానం అచరించారు. మహా కుంభం మొదటి ప్రధాన స్నానం సోమవారం 'పౌష్ పూర్ణిమ' సందర్భంగా జరిగింది. అయితే అఘోరాలు, హిందూ మతాల సభ్యులు మకర సంక్రాంతి రోజున వారి మొదటి స్నానం చేశారు.శ్రీ పంచాయతీ అఘోరా మహానిర్వాణి, శ్రీ శంభు పంచాయతీ అటల్ అఘోరా మొదట 'అమృత స్నాన్' తీసుకున్నారు. మహాకుంభ్‌లో వేలాది మంది అఘోరాలు పాల్గొంటున్నారు. అమృత స్నాన్ సందర్భంగా హెలికాప్టర్ నుంచి భక్తులపై గులాబీ రేకుల వర్షం కురిపించారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పూర్ణ కుంభం నిర్వహిస్తారు. అయితే 12 పూర్ణ కుంభాల తర్వాత 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభం జరుగుతుందని మహానిర్వాణి అఖారాకు చెందిన మహామండలేశ్వర చేతన్‌గిరి మహారాజ్ అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు అరుదైన వరం. 68 మంది మహామండలేశ్వరులు, మహానిర్వాణి అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు అమృత స్నానంలో పాల్గొన్నారు.

35 మంది మహామండలేశ్వరులు, నిరంజని అఘోరాకు చెందిన వేలాది మంది నాగ సాధువులు అమృత స్నాన్‌లో పాల్గొన్నారు. ఇది కాకుండా, జునా అఘోరా, ఆవాహన్ అఘోరా, పంచాగ్ని అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు కూడా అమృత్‌లో స్నానం చేశారు. ఆచార్య మహామండలేశ్వర్ స్వామి అవధేశానంద గిరి నేతృత్వంలోని కిన్నార్ అఘోరా సభ్యులు కూడా జునా అఘోరాతో పాటు పవిత్ర స్నానమాచరించారు. పెద్ద రథంలో ఘాట్ వద్దకు చేరుకున్న నాగ సాధువుల బృందం అనుసరించింది.నాగ సాధువులు ఈటెలు, త్రిశూలాలను ధరించి, వారి శరీరాలపై బూడిద పూసుకుని, కొన్ని గుర్రాలతో ఊరేగింపుగా రాజ స్నానానికి బయలుదేరారు. జుట్టులో పువ్వులు, మెడలో దండ, చేతిలో త్రిశూలంతో మహాకుంభానికి ఆధ్యాత్మిక వైభవాన్ని జోడించింది.

# కడిగిన ముత్యంలా కేటీఆర్ బయటకు వస్తారు

**- : మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

హైదరాబాద్, జనవరి 16

కావాలనే ఫార్ములా-ఈ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఇరికించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కడిన ముత్యంలా బయటకు వస్తారని రవిశంకర్ తెలిపారు. ఎన్ని చిల్లర కేసులు, బురదజల్లే కార్యక్రమాలు చేపట్టినా ఏమీ చేయలేరన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యానికి లేదని పేర్కొన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి రైతులకు నీళ్లందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈడీ కార్యాలయం వద్ద అరెస్టు చేసిన పలువురు బీఆర్ఎస్ నేతలను కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిలో పల్లెరవికుమార్ గౌడ్, క్రిశాంక్, సుమిత్రానంద్, పావని గౌడ్, కీర్తిలత గౌడ్, తదితరులు ఉన్నారు.

# సినీనటుడు సైఫ్‌అలీఖాన్‌పై దాడి

## -సుమారు ఆరుచోట్ల బలమైన గాయాలు
## -రెండున్నర గంటల పాటు సైఫ్‌కు సర్జరీ

ముంబై, జనవరి 16

: ముంబైలోని తన ఇంట్లో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడి చేశాడు ఓ దుండగడు. గురువారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో అతనిపై అటాక్ జరిగింది. దొంగతనం కోసం వచ్చిన వ్యక్తి.. హీరో సైఫ్ అలీఖాన్‌పై వాగ్వాదానికి దిగాడని, ఆ తర్వాత కత్తితో అటాక్ చేసినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. సైఫ్ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తన వద్ద ఉన్న పదునైన ఆయుధంతో హీరోను పొడిచాడు. సుమారు ఆరు చోట్ల బలమైన కత్తిపోట్లు ఉన్నట్లు లీలావతి ఆస్పత్రి డాక్టర్లు చెప్పారు. రెండు చోట్ల మాత్రం ఆ కత్తి పోట్లు చాలా డీప్‌గా ఉన్నట్లు వెల్లడించారు. తెల్లవారుజామున 2 గంటలకు ఇంట్లో దాడి జరగ్గా.. అతన్ని 3.30 నిమిషాలకు లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారం క్రితం అతను స్విట్జర్లాండ్ నుంచి తిరిగి వచ్చాడు. భార్య కరీనా కపూర్, ఇద్దరు పిల్లలతో కలిసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకునేందుకు యూరోప్ వెళ్లాడు. ఒక కత్తిపోటు సైఫ్ వెన్నుపూస సమీపంలో డీప్‌గా దిగినట్లు డాక్టర్లు చెప్పారు. మెడ, చేయి, వెన్నులో ఓ పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు డాక్టర్లు తెలిపారు. వెన్నులో దిగిన వస్తువును సర్జరీ ద్వారా తొలగించినట్లు డాక్టర్లు వెల్లడించారు. న్యూరోసర్జన్ నితిన్ దంగే, కాస్మిటిక్ సర్జన్ లీనా జైయిన్, అనస్థటిస్ట్ నిషా గాంధీ.. ప్రస్తుతం సైఫ్‌కు చికిత్స అందించినట్లు లీలావతి ఆస్పత్రి డాక్టర్ నీరజ్ ఉత్తమని తెలిపారు. సైఫ్ ఇంట్లో పనిచేసే పనిమనిషి చేయికి కూడా కత్తి గాయాలు అయ్యాయి. పోలీసులు ఆమె స్టేట్మెంట్‌ను రికార్డు చేశారు. రెండున్నర గంటల పాటు సైఫ్‌కు సర్జరీ చేశారు. ప్రస్తుతం అతను ఆపరేషన్ థియేటర్ రూంలోని రికవరీ రూమ్‌లో ఉన్నాడు.

# నటుడి సైఫ్ అలీ ఖాన్‌పై దాడి

**కత్తితో పొడిచిన దుండగుడు**
**అనుమానాస్పద వ్యక్తి తచ్చాడుతుండగా అడ్డుకున్న సైఫ్**
**తప్పించుకునే ప్రయత్నంలో కత్తితో దాడి**
**హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు**
**ప్రాణాపాయం లేదని ప్రకటించిన వైద్యులు**

ముంబై,జనవరి16( :

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి సంచలనంగా మారింది. గురువారం తెల్లవారుజామున ముంబైలోని తన ఇంటి వద్ద ఓ ఆగంతకుడు కత్తితో దాడి చేయడంతో అతడు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. సైఫ్ అలీఖాన్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. సైఫ్ అలీ ఖాన్ ముంబైలోని తన ఇంట్లో 11వ అంతస్తులో నిద్రిస్తుండగా అనుమానాస్పద శబ్దాలు రావడంతో అతనికి మేలుకువ వచ్చింది. ఓ వ్యక్తి ఇంట్లో దొంగతనానికి యత్నించగా సైఫ్ అతడిని పట్టుకోబోయాడు.. అయితే, ఆ దుండగుడు సైఫ్ నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఇద్దరి మధ్య తోపులాట జరిగింది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో జరిగింది. సైఫ్ నుండి తప్పించుకునేందుకు ఆ ఆగంతకుడు సైఫ్‌పై ఆరుసార్లు కత్తితో పొడిచి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ దాడిలో సైఫ్ తీవ్రంగా గాయపడ్డారు. అతడి కేకలు విన్న కుటుంబ సభ్యులు వెంటనే అప్రమత్తమై హుటాహుటినా అతడిని ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాంద్రా పోలీసులకు తెల్లవారుజామున 3 గంటలకు ఫిర్యాదు చేశారు. సైఫ్ అలీఖాన్‌ను బాంద్రా ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో పొడిచారని, తెల్లవారుజామున 3.30 గంటలకు ఆయనను ఆసుపత్రికి తీసుకువచ్చారని లీలావతి హాస్పిటల్ సిఓఓ డాక్టర్ నీరాజ్ తెలిపారు. సైఫ్ అలీఖాన్ ఆరు కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడ్డారని..వాటిలో ఒకటి వెన్నెముకకు ప్రమాదకరంగా ఉందని తెలిపారు. న్యూరోసర్జన్ డాక్టర్ నితిన్ డాంగే, కాస్మెటిక్ సర్జన్ డాక్టర్ లీనా జైన్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ నిషా గాంధీ నేతృత్వంలోని వైద్యుల బృందం సైఫ్ అలీఖాన్‌కు 2.5 గంటల పాటు న్యూరో సర్జరీ చేసింది. సైఫ్ ప్రస్తుతం ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని ఆసుపత్రి సిబ్బంది ధృవీకరించింది. నటుడు ప్రస్తుతం కోలుకుంటున్నారని, వైద్యులు అతని పురోగతిని పర్యవేక్షిస్తున్నారని సైఫ్ అలీ ఖాన్ బృందం ప్రకటన చేసింది. బాంద్రా పోలీస్ స్టేషన్‌లో ఆగంతకుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సైఫ్ అలీఖాన్ ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తి ప్రవేశించాడని, దాడి జరిగిన సమయంలో కొందరు నటుడి కుటుంబ సభ్యులు కూడా ఇంట్లో ఉన్నారని పోలీసు అధికారి తెలిపారు. సైఫ్ అలీఖాన్ ఇంట్లో పనిచేస్తున్న ముగ్గురు అటెండర్లను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు కేసు దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు. నిందితుడి కోసం క్రైమ్ బ్రాంచ్ 7 బృందాలను ఏర్పాటు చేసింది. క్లూల కోసం ఓ బృందం సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తోంది. ముంబైలోని వివిధ ప్రాంతాలకు మూడు బృందాలు బయలుదేరాయి.నిందితుడి కోసం ముంబై నుంచి ఓ బృందం వెతుకుతుంది. గురువారం ఉదయం బాంద్రా (పశ్చిమ) లోని సైఫ్ ఇంటి బయట స్నిఫర్ డాగ్స్ కనిపించాయి. ముంబై పోలీసులు ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. సైఫ్ అలీఖాన్ బృందం ఓ ప్రకటనలో 'మిస్టర్ సైఫ్ అలీఖాన్ నివాసంలో ఓ దుండగుడు చోరీకి ప్రయత్నించాడు. ఈ ఘటనలో సైఫ్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం అతను



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మీడియా, అభిమానులు సమయమనం పాటించాలి' అని కరీనా కపూర్ తెలిపారు. మిగిలిన కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారని కరీనా కపూర్ బృందం ధృవీకరించింది. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారని, ఆయన అభిమానుల ప్రార్థనలు ఫలించాయని, ఆపరేషన్ చేసిన వైద్య బృందానికి ధన్యవాదాలని తెలిపారు.

# పట్టపగలే దోపిడీ దొంగల హల్‌చల్

## -ఎటిఎం వాహనంపై దాడి.. కాల్పులు
## -ఒకరి మృతి.. మరో ఇద్దరికి గాయాలు

బెంగళూరు, జనవరి 16

కర్ణాటక రాష్ట్రంలో పట్టపగలే దారి దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఏటీఎం డబ్బులు పెట్టేందుకు వచ్చిన వాహనంపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒకరు మరణించగా.. ఇద్దరు బ్యాంకు సిబ్బందికి గాయాలయ్యాయి. ఈ ఘటన బీదర్‌లో చోటు చేసుకుంది. ఏటీఎంకు డబ్బులు తరలిస్తున్న వాహనంపై దోపిడీ దొంగలు దాడి చేశారు. బైక్‌పై వచ్చిన దుండగులు ఒక్కసారిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఓ సెక్యూరిటీ గార్డు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు బ్యాంకు సిబ్బందికి గాయాలైనట్లు తెలిసింది. దాడి అనంతరం డబ్బు పెట్టెలతో దుండగులు అక్కడి నుంచి ఉడాయించారు. అందులో సుమారు రూ.93 లక్షల నగదు ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాడి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిని అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన సిబ్బందిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగల కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

# సంక్రాంతి వచ్చింది సరదాలు తెచ్చింది.

## మొగ్గులతో కళకళలాడిన లోగిలి. - గుమగుమలాడుతున్న పిండి వంటలు.

## దేవరకద్ర కౌకుంట్ల గ్రామాలలో సంక్రాంతి సంబరాలు.

దేవరకద్ర, జనవరి 16 **(శాసనసభ న్యూస్):**
దేవరకద్ర, కౌకుంట్ల, మండలాల వివిధ గ్రామాలలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాలలో సంక్రాంతి సంబరాలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాలతో మధ్య జరుపుకుంన్నారు. అందులో భాగంగానే ఈ పండగ దిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్ళ ముందు రకరకాల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టారు. దీంతో ముగ్గుల కారణంగా ఇల్ల లోగిళ్ళకు,కొత్త అందం చేకూరింది. ఆయా గ్రామాలలోని దేవాలయాలలో నూతన వస్త్రాలు ధరించి, తమ సాంప్రదాయ రీతిలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ యోగక్షేమల కోసం ఆ దేవున్ని వేడుకున్నారు. పండగ సందర్భంగా దేవరకద్ర, కౌకుంట్ల ,మండలాలలో ముగ్గుల రంగులు విక్రయాలకు దుకాణాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని మహిళలు, యువకులు ,చిన్నారులు, ముగ్గులు వేయడం అందరిని ఆకట్టుకున్నాయి.

**ఈ సంక్రాంతి పండుగకు నోరూరించే ఘుమఘూమలు.**

అరిసెలు, గారెలు, మురుకులు, నువ్వుల ముద్దలు, ఈ పేర్లు చదువుతుండగానే నోరు ఊరుతుంది కదు... ఇప్పుడు ఏ వీధికి ఇంటికి వెళ్లిన ఈ గుమగుమలు వస్తున్నాయి. తెలుగింటి లోగిల్లు సంక్రాంతి పండుగకు సిద్ధమయ్యాయి. సంక్రాంతి స్పెషల్ పిండి వంటలు వీటిలో ఇంకా ప్రత్యేకంగా సకినాలు, అందుకే ఏ గుమ్మం వంక తొంగిచూసిన గుండ్రటి ఆకారంలో సకినాలు, బెల్లం, అరిసెలు, నోరురిస్తునాయి. పలువురు వీటిని ఇండ్లలో తయారు చేస్తుండగా మరికొందరు రెడీమేడ్ పిండి వంటలు తయారుచేసి విక్రయిస్తున్నారు. సంక్రాంతి పండుగ రోజు గంగిరెద్దుల సంచారం పెద్దగా కనిపించడం లేదు. రోజురోజుకు బసవన్న కనుమరుగవుతున్నాడు. వాటి పోషణ భారంగా మారడంతో వాటిని పెంచడానికి వాటి పోషకులు పెద్దగా ఆసక్తి కనపరచడం లేదు. ఒకప్పుడు సంక్రాంతి వస్తుందంటే చాలు పట్టణ ,గ్రామీణ ,ప్రాంతాలు బసవన్నలు సందడి చేసేవి.

**రైతుల పండుగ కనుమ.**

కనుమ పండుగను రైతులు ఘనంగా జరుపుకుంటారు. పాడి పశువులు దొడ్లను శుభ్రంగా కడిగి పూలు, మామిడి తోరణాలతో అలంకరిస్తారు. అలాగే పశువులకు కుంకుమ బొట్లు పెట్టి, మెడలో%ఎ% పూలదండలు వేసి ,వాటికి ప్రత్యేకమైన దాన అందజేస్తారు. అలాగే గోపూజ చేస్తారు



# భారత్‌లో భారీగా పెరిగిన ఇంటర్నెట్ వాడకం

**యూజర్ల సంఖ్య 90 కోట్లను దాటుతుందని అంచనా**

న్యూఢిల్లీ,జనవరి16
భారతదేశంలో రికార్డు స్థాయిలో ఇంటర్నెట్ యూజర్లు పెరుగుతున్నారు. 2025 నాటికి దేశంలో ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 90 కోట్లను దాటుతుందని గురువారం ఒక నివేదిక వెల్లడించింది. డిజిటల్ కంటెంట్ కోసం దేశంలోని ప్రాంతీయ భాషల వినియోగం పెరుగుతుండటం ఇంటర్నెట్ యూజర్ల పెరుగుదలకు కారణంగా ఉందని చెప్పింది. ఇండియాలో 2024 నాటికి ఈ సంఖ్య 88.6 కోట్లకు చేరుకుంది. గత ఏడాదితో పోలిస్తే 8 శాతం బలమైన వృద్ధిని సూచిస్తుంది. ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ,మరియు కాంటార్ నివేదిక ప్రకారం, 488 మిలియన్ల వినియోగదారులతో గ్రామీణ భారతదేశం ఈ వృద్ధికి నాయకత్వం వహిస్తుంది. మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో గ్రామీణ వినియోగదారులు 55 శాతం వాటాని కలిగి ఉన్నారు. దాదాపుగా అందరు యూజర్లు, అంటే 98 శాతం మంది భారతీయ భాషల్లో కంటెంట్‌ని యాక్సెస్ చేశారు. తమిళం, తెలుగు, మలయాళం వంటి భాషల్లో విస్తృతమైన కంటెంట్ ఉండటం కారణంగా అత్యంత ప్రజాదరణ లభిస్తోంది.పట్టణ ఇంటర్నెట్ యూజర్లలో సగానికి పైగా అంటే, 57 శాతం మంది ప్రాంతీయ భాషల్లో కంటెంట్‌ని ఇష్టపడుతున్నారు. ఇది అన్ని ప్లాట్‌ఫారమ్స్‌లో స్థానిక భాష కంటెంట్‌కి పెరుగుతున్న డిమాండ్‌ని చూపిస్తోందని నివేదిక పేర్కొంది. గతేడాది నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గేమ్ ఛేంజర్‌గా మారింది. ప్రతీ 10 మంది ఇంటర్నెట్ యూజర్లలో 9 మంది ఏఐ ఎంబెడెడ్ కలిగిన యాప్స్‌ని వాడుతున్నారు. భారతదేశంలో జెండర్ గ్యాప్ కూడా తగ్గుతోందని, మొత్తం ఇంటర్నెట్ యూజర్లలో 47 శాతం మంది మహిళలు ఉన్నారు. ఓటీటీ వీడియో, మ్యూజిక్ స్ట్రీమింగ్, ఆన్‌లైన్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా వినియోగం వంటి కార్యకలాపాలతో గ్రామీణ భారతం ఆధిపత్యం చెలాయిస్తోంది. ఈ వర్గాలు పట్టణ వినియోగదారుల్ని మించిపోయారు. 2023 మరియు 2024 మధ్య 54 శాతం పెరిగిన స్మార్ట్ టీవీలు మరియు స్మార్ట్ స్పీకర్లు వంటి సాంప్రదాయేతర పరికరాల స్వీకరణలో అర్బన్ ఇండియా ముందుంది. ఇదే సమయంలో పట్టణ, గ్రామీణ జనాభాలో ఇంటర్నెట్ యాక్సెస్ చేయడానికి మొబైల్ ఫోన్స్ అనేవి ప్రాథమిక మార్గంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది.

# ఏపీజీబీ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలి.

**(శాసనసభ న్యూస్):** కడప.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నాలుగు గ్రామీణ బ్యాంకులు కలిసి ఒకే గ్రామీణ బ్యాంకుగా ఏర్పడుతున్నందున, కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయన్ని కొనసాగించాలని ఆ బ్యాంకు ఉద్యోగ,అధికార సంఘాల ప్రతినిధులు బైరెడ్డి శబరి, నంద్యాల ఎంపీ ని కలిసి విన్నవించడం జరిగింది. కడప ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్నటువంటి ఏపీజీబీ మిగతా గ్రామీణ బ్యాంకులతో పోలిస్తే అతి పెద్దది కావడం,గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే సొంత భవనం కలిగి ఉండడం, దక్షిణ భారత దేశంలో ఏ గ్రామీణ బ్యాంకు కు లేనటువంటి కరెన్సీ చెస్ట్ సౌకర్యం కలిగి ఉండడంతో పాటు అత్యంత వెనుకబడిన ప్రాంతంలో ఉండడం వలన ప్రతిపాదిత గ్రామీణ బ్యాంకు కడప లోనే కొనసాగించడం అత్యంత ఆవశ్యకమని కోరడం జరిగింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అన్ని కార్యాలయాలు అమరావతిలో కేంద్రీకరించాలని భావిస్తున్న నేపథ్యంలో,నూతనంగా ఏర్పడబోతున్న,ఈ గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కూడా కడప నుండి అమరావతికి తరలిపోతుందన్న ఆందోళన, ఏపీజిబి సిబ్బందితో పాటు, ఈ ప్రాంత ప్రజల్లో కూడా వుంది. అత్యంత కరువు ప్రాంతాల్లో పనిచేస్తున్నప్పటికీ, అత్యధిక లాభాలు, అత్యధిక నిలువలు మరియు వ్యాపారంతో, ప్రత్యేకంగా వెనుకబడిన వర్గాలకు రుణాలు ఇవ్వడంలో,కీలకపాత్ర పోషిస్తున్న గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం తరలిపోవడమనేది, ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం తప్పక చూపుతుంది. మిగతా ప్రాంతాలతో పోల్చి చూసుకుంటే, వెనుకబడిన రాయలసీమలో ఎటువంటి ముఖ్యమైన కార్యాలయములు కానీ సంస్థ యొక్క కార్యాలయాలు లేకపోవడం, మిగతా ప్రాంతంలో అనేక కార్యాలయాలు కలిగి ఉండడమనే అంశాల్ని పరిగణలోకి తీసుకొని నూతనంగా ఏర్పడబోయే గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని ఏపీజీబీ ఉద్యోగులతో పాటు ఇక్కడ ప్రజల ఆకాంక్షగా వున్నది. కాబట్టి, ఈ అంశం పట్ల దృష్టి సారించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి, కడప నుండి ప్రధాన కార్యాలయం తరలి వెళ్లకుండా చూడగలరని కోరారు. ఇందుకు ఎంపీ స్పందిస్తూ, ఖచ్చితంగా తన వంతు కృషిని చేయగలనని,



సీఎం తో మాట్లాడి కడపలోనే హెడ్ క్వార్టర్స్ కొనసాగేలా చూడగలనని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ మరియు ఎంప్లాయిస్ సంఘాల తరపున ఈ.హన్మంత్ రెడ్డి,డి.రియాజ్ బాషా,పి.సురేష్,ఎంసివి రమణా రెడ్డి,ఎ.గజేంద్ర రెడ్డి,ఐ.ఆర్.సతీశ్ కె.రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ సుప్రీంను ఆశ్రయించిన బిఆర్ఎస్

న్యూఢిల్లీ,జనవరి16 బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ పార్టీ రెండు పిటిషన్లు దాఖలు చేసింది. 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసిన 9 నెలలు అవుతున్నా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ పేర్కొంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, మహిపాల్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డిపై రిట్ పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా ఇప్పటికీ స్పీకర్ చర్యలకు ఉపక్రమించలేదని కోర్టుకు బీఆర్ఎస్ తెలిపింది. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో బీఆర్ఎస్ పేర్కొంది. గతంలో కేశం మేఘా చంద్ర కేసులో ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోర్టును బీఆర్ఎస్ కోరింది. పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం చెప్పాలని కేశం మేఘా చంద్ర కేసులో తీర్పు వచ్చిందని గుర్తు చేసింది. మేఘా చంద్ర కేసు తీర్పుకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవట్లేదని బీఆర్ఎస్ తెలిపింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసింది.కారు గుర్తుపై గెలిచి.. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పది మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేసి 9 నెలలవుతున్నా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొంది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్‌కు వ్యతిరేకంగా ఎస్ఎల్‌పీ దాఖలు చేసింది. మిగిలిన ఏడుగురు ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా రిట్ పిటిషన్ దాఖలు చేసింది. నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఇదిలావుంటే బిఆర్ఎస్ నేత హరీష్ రావు హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. ఈ పిటిషన్ దాఖలు చేయడమే గాకుండా కెటిఆర్ విసయంలో లీగల్‌గా చర్చించేందుకే అని తెలుస్తోంది.




# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను జయప్రదం చెయ్యండి.

## -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపిఎస్.

**(శాసనసభ న్యూస్):** నంద్యాల ప్రతినిధి.
జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపిఎస్ పేర్కొన్నారు. ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి. ప్రతి సంవత్సరం చాలా మంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. హెల్మెట్ ధరించకపోవడం ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడంతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఏటా రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించే రవాణా శాఖ ఈసారి మాసోత్సవాలను నిర్వహిస్తోంది. జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై చాలా మందికి అవగాహన ఉంది. కానీ నిర్లక్ష్యంతో పాటించడం లేదు. ప్రధానంగా హెల్మెట్ ధరించకపోవడంతో అనేక మంది మరణిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీలతో పాటు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే మా ప్రధాన లక్ష్యం. జాగ్రత్తలు: ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ , కారు నడిపేవారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలి. మూలమలుపుల వద్ద రోడ్డు దాటకూడదు. మద్యం సేవించి వాహనాలు నడపరాదు. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న చోట ఓవర్‌టేక్ చేయొద్దు. అతివేగంగా వాహనం నడిపితే అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడడం చెయ్యరాదు. రాత్రివేళల్లో విధిగా డిప్పర్ వాడాలి. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఎన్.యుగంధర్ బాబు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లు జి.శ్రీకాంత్, మరియు జి.టి నాయుడు పాల్గొన్నారు.

# శిల్పానగర్‌లో వార్డు పర్యటన నిర్వహించిన ఎన్ఎండి ఫిరోజ్.

**(శాసనసభ న్యూస్):** నంద్యాల ప్రతినిధి.
నంద్యాల పట్టణంలో బొంతలా వీధి శిల్పనగర్ ఏర్పడి 17ఏళ్ళు పూర్తి కావస్తున్న గత పాలకులు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ వార్డ్ పర్యటన నిర్వహించారు అందులో భాగంగా వారి దృష్టికి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండి,కరెంటు తీగలు క్రిందకు వేలాడుతూ,ఓపెన్ డ్రైనేజ్ కాలువలు ప్రవహిస్తూ ఉండటంతో పిల్లలు వృద్ధులకు ప్రమాదకర పరిస్థితి ఉందని తెలియజేశారు . అనంతరం ప్రజల నుండి వినతులు స్వీకరించి త్వరలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరిస్తామన్నారు. అలాగే కాలనీ ఇళ్ల మధ్యలోనున్న స్థలంలో ఆమోదయోగ్య కట్టడం నిర్మించాలని ప్రజల నుండి వచ్చిన వినతిని స్వీకరించడం జరిగింది. అదే విధంగా ఈ కాలనీలో ఖాళీగా ఉన్న స్థలంలో కమ్యూనిటీ హాల్/ ఆట స్థలం/ఆమోదయోగ్యమైన కట్టడం నిర్మించాలని ప్రజల నుండి వచ్చిన వినతులను స్వీకరించి త్వరలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి తెలియజేసీ పరిష్కరిస్తామని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు ఇంచార్జి చిన్నంశెట్టి శ్రీనివాసులు, 10 వార్డు ఇంచార్జ్ ఎస్ అన్వర్, కరీముల్లా,సింహాద్రి సురేష్ బాబు, పెద్ద మురళి,కామిని మల్లికార్జున, ఇసుక చాంద్,బింగుమల్లే శ్యాంసుందర్ గుప్తా,గొల్ల శంకర్, ఆసిఫ్,జబ్బర్, ఖాదర్ భాషా, షాహిన్ భాష,హుస్సేన్ భాష, అక్తర్,నూర్ భాషా,భవనాసి శ్రీధర్, ఎల్లతల శ్రీనివాసులు,సంఘ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# రామగిరి మండలంలో ఘనంగా సంక్రాంతి కనుమ వేడుకలు

పేద్దపల్లి :రామగిరి :( **(శాసనసభ న్యూస్):**
రామగిరి మండలం లో మంగళ, బుధ వారాలలో ఘనంగా సంక్రాంతి,కనుమ వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాలలో దేవాలయాలలో పూజలు నిర్వహించారు. మహిళలు ఇండ్లలో వ్రతాలు నిర్వహించారు. కనుమ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఒకరింటికి ఒకరు వెళ్లి కుంకుమ బొట్టు పెట్టుకుంటూ, నోముకున్న వస్తువులను అందించి, కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. బంధువులు, చుట్టాలతో ప్రతి ఇంటింటా సంబరాలు ఘనంగా జరిగాయి.



# ముఖ్యమంత్రి ఎల్వోసీ కాపీని బాధ కుటుంబానికి అందజేసిన ఎమ్మెల్యే జీ మధుసూదన్ రెడ్డి.

దేవరకద్ర జనవరి 16.
దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండలం అజకోల్లు గ్రామానికి చెందిన భార తయ్య గుండె సంబంధించినటువంటి గుండె ఆపరేషన్ నిమిత్తం హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆపరేషన్ కు సంబంధించిన ఖర్చుల నిమిత్తముకుగాను ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఎల్ఓసి కాపీ 4 లక్షల రూపాయలను కాపీని కుటుంబ సభ్యులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అందజేశారు. నిమ్స్ లో చికిత్స పొందుతున్న పరామర్శించి అతని చికిత్స నిమిత్తము డాక్టర్లను సంప్రదించి మెరుగైన చికిత్సను అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరాపల్లిలో ఉత్సాహంగా సంక్రాంతి పండగ

## -కుటుంబ సభ్యులతో హాజరైన ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు.

అనకాపల్లి జిల్లా:- **(శాసనసభ న్యూస్):** కనువిందు చేసిన సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ఆధ్వర్యంలో కనీవిని ఎరగని రీతిలో జరిగిన సంబరాలు..ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ముగ్గుల పోటీలు, గుర్రపు పందెం పోటీలు, ఎడ్ల బళ్ళు ప్రదర్శన ఊహించని రీతిలో ఒకే చోట సంబరాలు జరపడంతో ఆనందం వ్యక్తం చేసిన ప్రజలు దేవరాపల్లి : మండల కేంద్రం లో మంగళవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి సంక్రాంతి ఉత్సవాలను తిలకించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. తెలుగు సాంస్కృతిక సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన అనేక కళా ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో



గెలుపొందిన విజేతలకు భారీ నగదు బహుమతులను ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగాఅనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ సాంస్కృతిక సాంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. రానున్న రోజుల్లో అనకాపల్లి నియోజకవర్గ ప్రజలకు తీయని కబురు అందిస్తామన్నారు. ఇప్పటికే 1. 85 వేల కోట్లలతో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నామన్నారు. వెనుకబడిన మాడుగుల నియోజకవర్గంలో యువతకు



ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు తీసుకురానున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీ సీఎం రమేష్ ఎమ్మెల్యే బండార సత్యనారాయణ లకు రైతు చిహ్నం నాగాళ్లను కిలపర్తి కుటుంబ సభ్యులు బహుకరించారు. ఈ సమావేశంలో సీఎం రమేష్ సోదరులు సురేష్ నాయుడు, రిత్వి, బండారు తనయుడు అప్పలనాయుడు, కూటమి శ్రేణులు, మండల ప్రజలు, స్థానికులు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఇన్నోవా కారు

## -ముగ్గురికి తీవ్ర గాయాలు ఆస్పత్రిలో చికిత్స.



ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఇన్నోవా కారు ఢీ కొట్టగా ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన చింతపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చింతపల్లి ఎస్సై బి.యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం 14 వ తేదీ రాత్రి సుమారు 7 గంటల15 నిమిషాల ప్రాంతంలో హొమంతలపల్లి గ్రామం నుండి సంక్రాంతి సందర్భంగా పెరమాళ్ళ ఆలయంలో ఫలహార బండ్ల ఉత్సవాలను తిలకించి ఎపి 24పి 0797 అను నెంబర్ గల మోటార్ సైకిల్ పై చింతపల్లి కి తిరిగి కందుల నాగయ్య తండ్రి పిచ్చయ్య, కందుల రమేష్ తండ్రి పిచ్చయ్య,నల్ల రమేష్ తండ్రి గౌరయ్య అను ముగ్గురు మోటార్ సైకిల్ పై వస్తుండగా టీఎస్ 07జె.వై 6555 నెంబర్ గల ఇన్నోవా కార్ డ్రైవర్ హైదరాబాదుకు చెందిన లింగంపల్లి జగన్ తన కారును అతివేగంగా అజాగ్రత్తగా నడిపి హొమంతలపల్లి గ్రామ శివారులో మోటార్ సైకిల్ ను ఢీకొట్టడంతో, మోటార్ సైకిల్ పైన ఉన్న ముగ్గురికి తీవ్రమైన గాయాలు కాగా హైదరాబాద్ ఆస్పత్రిలో చేర్పించారు. కందుల పిచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం చింతపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని ఎస్సై తెలిపారు

# అనకాపల్లి గవరపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో నిర్వహించిన పత్రిక సమావేశం

విశాఖపట్నం:- **(శాసనసభ న్యూస్):**
తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఈనెల 18 వ తేదీ అనగా శనివారం రోజు అనకాపల్లి నియోజక వర్గంలో కార్యక్రమలు నిర్వహించాలి. తెలుగుదేశం పార్టీ వార్డ్ నాయకులు, మండల కమిటీ నాయుకులు, గ్రామ శాఖ అధ్యక్షులు ,అనుబంధ సంఘాల నాయకులు,టీడీపి సభ్యులు,క్లస్టర్ ఇంచార్జీలు,యూనిట్ ఇంఛార్జిలు,బూత్ ఇంఛార్జిలు, తెలుగు మహిళలు, తెలుగు యువత నాయుకులు, అందరూ తమ తమ గ్రామాలలో స్వర్గీయ నందమూరి తారకరామారావు. వర్ధంతి కార్యక్రమాలు(పేదలకు పళ్ళు.. బట్టలు..అన్న. విగ్రహాలు కు పూలమాలలతో అలంకరించడం) లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లోఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ లు బత్తుల తాతయ్య బాబు, మల్ల సురేంద్ర, పీ వీ జి కుమార్, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు కాయల మురళి, గొంతిన శ్రీనివాసరావు, బొడెడ జోగినాయుడు, కొట్నీ బాలు, బొలిశెట్టి శ్రీనివాసరావు మరియు కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.ం

# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న నంద్యాల వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి.

**(శాసనసభ న్యూస్):** నంద్యాల ప్రతినిధి.
జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా నంద్యాల రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా సంస్థకు చెందిన డ్రైవర్లు మరియు వారి సిబ్బందితో ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని మీరు చేసే ఒక చిన్న పొరపాటు వలన ప్రమాదంజరిగి మీరు కుటుంబం ప్రమాదంలో పడటమే కాకుండా ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని కావున మీరు వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఐపిఎస్ ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ నందు రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని స్కూల్లో మరియు కళాశాలలో మరియు ముఖ్యమైన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు భద్రత నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరుగుతుంది. ఇందులో భాగంగా ప్రతిరోజు జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. కావున ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని,మద్యం



సేవించి వాహనాలు నడపరాదని,సెల్ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని,అతివేగంగా అజాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల గురై ప్రాణాలు కోల్పోవద్దని తెలియజేశారు.

# నవోదయ ఎంపిక పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి.

విశాఖపట్నం:- **(శాసనసభ న్యూస్):**
జవహర్ నవోదయ విద్యాలయ లో ఆరవ తరగతిలో ప్రవేశానికి 18 వ తేదీన నిర్వహించబోయే ఎంపిక పరీక్ష కోసం విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాలలోని 39 కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రిన్సిపాల్ డా.వై.ఎస్.ఎస్.చంద్రశేఖర్ చెప్పారు. ఈ పరీక్షకు 9080 మంది హాజరవనున్నట్లు ఆయన తెలిపారు..మూడు జిల్లాలకు చెందిన పరీక్షా కేంద్రాల సుపరెంటెండెం ట్లకు, పరిశీలకుల కు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శిక్షణ నిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ పాల్గొని ఎటువంటి లోపాలు లేకుండా పరీక్షను నిర్వహించాలని, ప్రతీ సెంటర్లో తగిన శ్రద్ధ వహించాలి అని సూచించారు. 18 వ తేదీన, పరీక్ష 11.30 నుండి 1 గా.వరకు నిర్వహించాలని ప్రిన్సిపాల్ సూచించారు.పరీక్ష నిర్వహణకు అవసరమైన సూచనలు చేస్తూ మార్గదర్శకాలు అందించినందుకు జిల్లా కలెక్టర్.కి ధన్యవాదాలు తెలియజేశారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ ఆర్మీ సైనికులకు సన్మానం

పేద్దపల్లి :రామగిరి **(శాసనసభ న్యూస్):** ఆర్మీ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో దేశ ఆర్మీలో పనిచేసి పదవీవిరమణ పొందిన తరువాత సింగరేణి సంస్థలో చేరి ఓసీపీ 2 సేవలందిస్తున్నా మాజీ సైనికులు కోట రవీందర్ రెడ్డి,మదన్ ప్రసాద్,కసిం,దర్మెందర్ లను ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం క్లబ్ అధ్యక్షులు మొలుమురి శ్రీనివాస్,డైరెక్టర్ ,మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ మనం ఈరోజు ప్రశాంత జీవనం గడుపుతూ సంతోషంగా ఉన్నామంటే దానికి కారణం భారత సైనికులు, 24 గంటలు సరిహద్దుల్లో దేశానికి కాపలా కాస్తూ ఎడారి ఎండల్ని, కాశ్మీరు మంచును, మేఘాలయా వర్షాలను లెక్కచేయకుండా దేశరక్షణలో ప్రాణత్యాగానికైనా సిద్ధపడుతారు. కోట్లాది భారతీయుల కోసం తమ కుటుంబాలకు దూరంగా మంచుగడ్డల్లో, ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తూ దేశాన్ని కంటికి రెప్పలా కాపలా కాస్తున్నారు.వారిని రవించుకోవడం మన మన బాధ్యత అని తెలిపారు అలాగే మాజీ సైనికులు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ 1947లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1949 వరకు కూడా భారత సైన్యానికి ఒక బ్రిటీష్ అధికారి జనరల్ ఫ్రాన్సిస్ బుచర్ నాయకత్వం వహించారు. 1949 జనవరి 15న ఆయన పదవి విరమణ చేసిన భారతీయుడైన లెఫ్టినెంట్ జెనెరల్ యం యం కరియప్పకు భారత సైన్య పగ్గాలను అప్పగించారు. దీంతో భారత సైన్యానికి మొట్టమొదటి భారతీయ ఆర్మీ జనరల్ యం యం కరియప్ప చరిత్రకెక్కారు. ఆ రోజు భారత సైన్యం పూర్తిగా బ్రిటీష్ వారి నుంచి విముక్తి పొందింది గనుక ఈ రోజునే భారత సైన్యం ఇండియన్ ఆర్మీ డే వేడుకలు జరుపుకుంటుందని, మమ్ములను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యమంలో ఓ సి పి 2 సంక్షేమ అధికారి ప్రీతి,లయన్స్ క్లబ్ సభ్యులు ఎల్లంకీ రామారావు,మేకల మారుతి యాదవ్,పరాంకుశం శ్రీనివాస చారి మరియు కార్మిక సంఘ నాయకులు ఎంఆర్సీ రెడ్డి, రామిడ్ల మనోహర్, సంతోష్,సదానందం,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు




# ఉమ్రా యాత్రలో భాగంగా పవిత్ర కాబ గృహం వద్ద ఇహ్రాం ధరించి లక్షలాది ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**(శాసనసభ న్యూస్):** నంద్యాల ప్రతినిధి.
రాష్ట్రానికి మంత్రైనా దేశానికి ప్రధానైన ఆ అనంత కరుణామయుడైన అల్లాహ్ దాసులే, ఎంతటి ధనవంతుడైన ఎంతటి పేదవాడైన అందరూ సామానులే, ప్రపంచవ్యాప్తంగా కొట్లాది మంది ముస్లింలు జీవితంలో ఒకసారైనా ఈ ప్రాంతాన్ని సందర్శించాలనుకునే ఈ మక్కా నగరాన్ని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ సందర్శించారు. సౌదీ అరేబియా దేశంలోని పవిత్ర మక్కా నగరంలో గల దైవ గృహం కాబా వద్ద తవాఫ్ చేస్తూ,పవిత్ర కాబా వద్ద నెలకొన్న అద్భుతమైన దృశ్యం చూస్తూ,నిరాడంబరంగా రెండు ముక్కల తెలుపురంగు సంప్రదాయ వస్త్రాధారణ ధరించి పవిత్ర కాబా యొక్క అద్భుతమైన దృశ్యం తిలకిస్తూ ఆ అనంతకరుణామయుడైన అల్లాహ్ ను స్తూతిస్తూ తవాఫ్ చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల కోసం మరియు ప్రత్యేకించి నంద్యాల నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, శాంతి సుఖ సంతోషాలతో వెల్లివిరిస్తూ అభివృద్ధి వైపు అడుగులు వెయ్యాలని అల్లాహ్ ను ప్రార్థించినట్లు తెలియజేయడం జరిగింది.

# భూముల పరిశీలనలో తహసిల్దార్

**(శాసనసభ న్యూస్):**
జనవరి 16 ఈరోజు బషీరాబాద్ మండలంలోని క్యాద్గిరా గ్రామంలోని వ్యవసాయ భూములను మరియు వ్యవసాయేత్తర భూములను మరియు ఘని భూములను బషీరాబాద్ మండల తహసిల్దార్ వై వెంకటేష్ తన సిబ్బందితో కలిసి పరిశీలించడం జరిగింది. ప్రభుత్వం తలపెట్టిన రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా అందేలాగా చర్యలు తీసుకుంటున్నామని తహసిల్దార్ వివరించారు. అలాగే గ్రామాలలో రేషన్ కార్డుల పర్యవేక్షణ కూడా జరుగుతుందని వివరించారు.



# తెలంగాణ రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



గుమ్మడిదల మండలం **(శాసనసభ న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.గుమ్మడిదల మండల కేంద్రంలో సిజిఆర్ యువసేన సభ్యులతో కలిసి పతంగులు ఎగరేసిన ఆయన, ఈ పండుగను కుటుంబ సమేతంగా ఆనందంగా జరుపుకోవాలని ప్రజలకు సందేశం ఇచ్చారు. సంక్రాంతి పండుగ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఈ పండుగ ప్రతి ఇంటా సంతోషం, శ్రేయస్సు నింపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ ట్రస్టు సభ్యులు సూర్యనారాయణ కుంటి మల్లేష్ ముదిరాజ్ వినోద్ ,సిజిఆర్ యువసేన సభ్యులు బాబు యాదవ్ మురళి యాదవ్ అరవింద్ రెడ్డి సాయి యాదవ్ దీపక్ రోహిత్ రెడ్డి ఈశ్వర్ లక్ష్మణ్ యశ్వంత్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ




**గుమ్మడిదల మండలం జనవరి 16 (శాసనసభ న్యూస్):**
గుమ్మడిదల మండల కేంద్రంలో విశ్వకర్మ సంఘం అధ్యక్షులు కాసోజి రవీంద్ర చారి ఆధ్వర్యంలో సంఘం వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి క్యాలెండర్ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “విశ్వకర్మ సంఘం ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే దిశగా ఈ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమైనది. యువతతోపాటు సభ్యులు సంఘానికి మరింత బలాన్ని చేకూర్చాలని” అన్నారు. అలాగే, సంఘం సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సిజిఆర్ ట్రస్ట్ సభ్యులు సూర్యనారాయణ జయపాల్ రెడ్డి కుంటి మల్లేష్ ముదిరాజ్ వినోద్ విశ్వకర్మ సంఘం నాయకులు కమ్మరిసత్యనారాయణచారి దామోదర్ చారి అశోక్ చారి లక్ష్మణ్ చారి మల్లేష్ చారి రమేష్ చారి సత్యనారాయణచారి నరసింహచారి శివకోటయ్య చారి వీరాచారి సంఘం సభ్యులు, పాల్గొన్నారు.

## ఆర్ టీవీ ఫోక్ సాంగ్ యూట్యూబ్ ఛానల్ రవికి చాకలి ఐలమ్మ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్ అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆర్థిక సహాయం



**చండూర్ జనవరి 16 (శాసనసభ న్యూస్):** నల్గొండ న్యూస్ ఆర్ టీవీ ఫోక్ సాంగ్ యూట్యూబ్ ఛానల్ రవి తీవ్ర అనారోగ్యంతో గత రెండు నెలలుగా అపెండిక్స్ కడుపునొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న ఐదు రోజుల్లో తండ్రి అకాల మరణం, దానికి తోడు కడుపులో ఇన్ఫెక్షన్ తో నల్లగొండ పట్టణంలోని సంకల్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న చాకలి ఐలమ్మ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్, అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారు అక్కడికి చేరుకొని పండ్లు, ఆర్థిక సహాయం చేశారు. రవి కుటుంబ సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. చాకలి ఐలమ్మ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్ మాట్లాడుతూ రవి ఆరోగ్యంగా ఉన్న సమయంలో ఇలాంటి ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొని, స్వచ్ఛంద కార్యక్రమాలను తన వీడియో ద్వారా కవర్ చేశారన్నారు. అలాగే తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ఎంతోమందికి తను నటించిన ఫోక్ సాంగ్స్ ని అందించారని గుర్తు చేశారు. రవి చాకలి ఐలమ్మ పాట చిత్రీకరణ కు సహకరించారని రవితో పాటు పనిచేసిన ఎంతోమంది కళాకారులు, మీడియా మిత్రులు ఎంతో కొంత ఆర్థిక సహాయం చేసి హాస్పిటల్ బిడ్డలకు సహకరించగలరని అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారు కోరుకున్నారు. అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి మిత్రునికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్, అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సురకారపు యాదగిరి గౌడ్, కంచర్ల రఘురాం రెడ్డి, పాలకూరి నరసింహ గౌడ్, దోనాల లింగారెడ్డి, కట్టెబోయిన సంజీవ యాదవ్, అయితగోని ప్రసాద్, తుపాకుల ప్రవీణ్, తుమ్మలపల్లి మహేష్, రజక సంఘం నాయకులు యలిజాల శంకర్, నడిగోటి నాగరాజు, కురుమ లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

# చింతుల్లలో సంక్రాంతి క్రీడలు ముగింపు

### -అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు
### -సామర్ది జగన్ -విజేతలకు బహుమతులు ప్రధానం





**యాచారం శాసనసభ న్యూస్ ( జనవరి 16):.** మండల పరిధిలో చింతుల్ల లో సంక్రాంతి పండగ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా క్రీడలు నిర్వహించారు. బుధవారం రాత్రి క్రీడలు ఉత్సవాల సందర్భంగా సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు సామర్ది జగన్ అధ్యక్షత వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మాత్రమే కాదు.. యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రజల అవసరాల కనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కరోనా సమయంలో గ్రామ ప్రజలకు 18 క్వింటాల రైస్ పంపిణీ చేశారు. చింతుల్ల నుండి గుమ్మడవల్లి రోడ్డుకు తారు రోడ్డు వేయాలని నిరాహార దీక్ష చేయడం జరిగింది. గ్రామంలోని పేద ప్రజలకు ఏ ఆపద వచ్చిన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అండగా ఉంటామని తెలియజేశారు. క్రీడలలో గెలుపు ఓటమి సహజమని భావించారు. ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహంతో ఉండడమే కాదు.. గెలిచే వరకు పోరాడాలని భరోసా ఇచ్చారు. గ్రామ పెద్దలు మహిళలు యువతీ యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి మస్కు భగత్, ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కే వికాస్, కార్యదర్శి సామర్ది వంశి, జానపద వృత్తి కళాకారుల రాష్ట్ర అధ్యక్షులు ఎంజి వినోద్ కుమార్, న్యాయవాది కే అరుణ్ కుమార్, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు మస్కు సంజీవ, సలహాదారులు నాగని బుగ్గ రాములు, కే వినోద్ కుమార్, గంధం రాఘవేందర్, నాగని సుధాకర్, నాగని నాగేష్, సామర్ది జంగయ్య, సామర్ది అభిలాష్, మాజీ ఉపసర్పంచ్ కొనేంటి ఈశ్వర్, మాజీ ఉపసర్పంచ్ నాగని రాందాస్, భవాని యూత్ అధ్యక్షులు కంకర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవంలో పాల్గొన్న మర్రి నిరంజన్ రెడ్డి

**మంచాల, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 16**

మంచాల మండల కేంద్రంలో మంచాల సూపర్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన మర్రి నిరంజన్ రెడ్డిని ఆర్గనైజర్స్ ఘన స్వాగతం పలికారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లో గెలుపొందిన జట్లకు బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి. క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరధారుఢ్యానికి దోహదపడతాయి అన్నారు, క్రీడాకారులు ఈ అవకాశాలను వినియోగించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉత్తమ క్రీడాకారులకు తన తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు, ఈ సందర్భంగా నిర్వహించిన భరతనాట్యం,చిన్నారుల ఆటపాటలు, డాన్స్ ప్రోగ్రాం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇబ్రహీంపట్నం ఆంగ్లిష్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ ఏబిసిడి డాన్స్ అకాడమీ లో గత నాలుగు సంవత్సరాలుగా భరతనాట్యం నేర్చుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచిన వెలిమినేడు గ్రామానికి చెందిన మంద భారతి కూతురు చిన్నారి మంద నిసి ( ఏంజిల్, చేతన) ప్రత్యేకంగా నిలువగా మరి నిరంజన్ రెడ్డి సన్మానించి అభినందించారు. మొదటి బహుమతి 20000/- ద్వితీయ బహుమతి 11000/-, షీల్డ్, టోర్నమెంట్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీకాంత్ కు మ్యాన్ ఆఫ్ సిరీస్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ శ్రీకాంత్, నాని, రాములు, ప్రశాంత్,అజయ్, మాజీ వార్డు సభ్యులు రాజేష్, వెంకటరమణ, నాయకులు అశ్వాల బాలరాజ్, పోచయ్య, సురేష్, శ్రీకాంత్ క్రీడాకారులు, చిన్నారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ప్రపంచంలో మిగిలేది మానవత్వ పరిమళమే


**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి జనవరి 16**

మానవ సంబంధాలు మటుమాయమైపోతున్న రోజుల్లో మనుషుల్లో మానవత్వం ఇంకా బతికే ఉంది. సమాజంలో కొంతమంది కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రవర్తిస్తున్నారు. అయితే, సమాజంలో వీరి శాతాన్ని బాగా పెంచుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో చింతపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి భాగ్యనగరానికి బయలుదేరగా వింజమూరు గ్రామ చౌరస్తాకు చేరుకోగానే రోడ్డుపై చిన్న హ్యాండ్ బ్యాగ్ పడిఉండడాన్ని ముచ్చర్ల యాదగిరి అతని డ్రైవర్ చోటు గమనించారు. హ్యాండ్ బ్యాగును తెరచి చూడగా 23000 వేల రూపాయల నగదు 5 గ్రాముల బంగారు వస్తువులు, ఒక సెల్ ఫోన్, ఆధార్ కార్డు కనిపించాయి. ఆధార్ కార్డు ఆధారంగా డిండి మండలానికి చెందిన రామావత్ రోజాకు చెందినవిగా గుర్తించారు. ముచ్చర్ల యాదగిరి మిత్రుడు డిండి మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వరరావు కు విషయాన్ని తెలియపరిచారు. విషయం తెలుసుకున్న రోజా చింతపల్లి కి వచ్చి పోలీస్ స్టేషన్ లో ముచ్చర్ల యాదగిరి, ఎస్సై బీనమోని యాదయ్య చేతుల మీదగా అందజేశారు. పోయిన వస్తువులు మాజీ సర్పంచ్ ముచ్చర్ల యాదగిరి ద్వారా దొరికినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్బంధిత వాహనాల వేలం

తుర్కయంజాల్, శాసన సభ :వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను ఈనెల 19వ తేదీన వేలం వేయనున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్‌చంద్రారెడ్డి తెలిపారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడలో ఉన్న ప్రాంతీయ రవాణా కార్యాలయంలో ఆదివారం రోజున ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ముందుగా రూ.500 ధరావత్తు ,డిపాజిట్ కొరకు రూ. 2000/-లు చెల్లించి ఉన్నవారు వేలంలో పాల్గొనవచ్చని ఆర్టీవో సూచించారు. ఈ బహిరంగ వేలంలో ఉన్న వాహనముల యొక్క జాబితా ఇతర శరత్తులను మా వెబ్ సైట్ www.transport.telangana.gov.in లో పొందుపరిచామని తెలియజేయుచున్నామన్నారు





## చండూర్ మున్సిపల్ కమిషనర్ & చైర్మన్ కి వినతి పత్రం అందజేసిన - ఫోటో&వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్

**చండూర్ జనవరి 16 (శాసనసభ న్యూస్):** చండూరు ఫోటో %఑% వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో చండూరు మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ చైర్మన్ కి చండూరు పట్టణం కేంద్రములో ఫోటోగ్రాఫర్స్ సంఘం (ఛాయ చిత్ర కార్మికులు) సంక్షేమ దృశ్య నూతన భవన నిర్మాణం కొరకు ప్రభుత్వ స్థలం మంజూరు కోరకు గురువారం మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అలీ కి, చండూరు మున్సిపాలిటీ చైర్మన్ తోకల చంద్రకళ -వెంకన్న కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కొత్త అంజిబాబు గౌడ్, ప్రధాన కార్యదర్శి వర్కాల కిరణ్ కుమార్, కోశాధికారి తుమ్మల ఆంజనేయులు, కుటుంబ భరోసా ఇంచార్జ్ నల్ల స్వామి గౌడ్, ఇడికోజు వెంకటాచారి, దాసరి కోటి, మాదగోని రమేష్ గౌడ్, తిరుమణి శ్రీశైలం, నారబత్తోజు తిరుమల చారి, ఇరిగి రామకృష్ణ,
చెనగాని వెంకన్న, చెనగాని సురేష్, మర్లు రమేష్ , ఆడెపు మహేష్, శివ, రమేష్, సిద్దు, నాగేంద్ర, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## చండూరులో అమైర ఆయుర్వేద పంచకర్మ సెంటర్ ప్రారంభించిన - డాక్టర్ కోడి శ్రీనివాసులు

**చండూర్ జనవరి 16 (శాసనసభ న్యూస్):**



చండూరు మున్సిపాలిటీ పరిధిలో గురువారం రోజు అమైర ఆయుర్వేద పంచకర్మ సెంటర్ ను ట్రస్మా జిల్లా అధ్యక్షులు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి నివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న చండూరు పట్టణంలో ఆయుర్వేద పంచకర్మ సెంటర్ ఏర్పాటు కావటం సంతోష దాయకమని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. క్లినిక్ నిర్వకులు డా. మద్దెల లఖన్, ఆశ కిరణ్ లు మాట్లాడుతూ ప్రజలకు ఆయుర్వేద చికిత్స పై నమ్మకం కలిగించాలనే ఉద్దేశ్యంతో ఈ క్లినిక్ ప్రారంభించటం జరిగిందని అన్నారు. ఈ క్లినిక్ నందు వెన్ను నొప్పి, మెడ నొప్పి, చర్మవ్యాధులు, మధుమేహ వ్యాధులకు చికిత్స, పంచకర్మ ప్రక్రియ ద్వారా చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పన్నాల లింగయ్య, కర్నాటి లక్ష్మయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అందరివాడు

### -అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు ల విగ్రహాలకు 1.30 లక్ష ఆర్థిక సాయం
### -కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్



**యాచారం శాసనసభ న్యూస్ (జనవరి 16):.** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, బాబ్ జగ్జీవన్ రావుల విగ్రహాలకు 1.30 లక్ష రూపాయలు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలో మాల్ లో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయనట్లు తెలిపారు. విగ్రహాలను నాగర్ కర్నూల్ జిల్లా, వెల్దండ గ్రామం నుండి మాల్ కు తీసుకురావడం జరిగింది. ఈ కార్యక్రమానికి వందలాదిమంది విగ్రహ ప్రతిష్టకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మ జహంగీర్, చిన్నోళ్ల మల్లేష్, గొల్లపల్లి భాస్కర్ గౌడ్, గుడుకుంట్ల కృష్ణ, మందలింగం, చిన్నోళ్ల వెంకటయ్య, చిన్నోళ్ల యాదయ్య, గుడుకుంట్ల రాములు, గడ్డమీది మదర్, చిన్నోళ్ల గోపాల్, గడ్డమీది యాదయ్య, చిన్నోళ్ల మల్లయ్య, జంగిలి యాదయ్య, మస్క ముత్యాలు, బోడ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

# కొండపురం దశరథ అనారోగ్యంతో మృతి

### -అంత్యక్రియలకు 5 వేలు ఆర్థిక సాయం -మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు

**యాచారం శాసనసభ న్యూస్ (జనవరి 16):.** మండల పరిధిలో కొత్తపల్లి గ్రామానికి చెందిన కొండపురం దశరథ అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ఆయన ప్రార్థివ దేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తూ, ఆయన కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపి, అంత్యక్రియలకు 5 వేలు ఆర్థిక సాయం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు అందించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చనిపోవడం పార్టీకి తీరని లోటు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రన్ని, మాజీ ఎంపీటీసీ బాలయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## టీమిండియా వరుస వైఫల్యాలపై బీసీసీఐ మార్పులు?

టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా దేశవాళీ దిగ్గజం, భారత్-ఏ హెడ్ కోచ్ సితాన్షు కోటక్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) బ్యాటింగ్ కోచ్‌ను నియమించాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఓ జాతీయ ఛానెల్ పేర్కొంది. బ్యాటింగ్‌కు స్పెషలిస్ట్ కోచ్‌ను నియమిస్తేనే టీమిండియా వరుస వైఫల్యాలకు బ్రేక్ పడుతుందనే ఆలోచనలో బోర్డు ఉన్నట్లు సమాచారం. దేశవాళీ క్రికెట్ దిగ్గజమైన సితాన్షు కోటక్ పేరును ఖరారు చేసినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియాపేర్కొంది. సితాన్షు కోటక్ గతంలో టీమిండియాకు తాత్కలిక హెడ్ కోచ్‌గా వ్యవహరించారు. జస్‌ప్రీత్ బుమ్రా సారథ్యంలోని భారత జట్టు టీ20 సిరీస్ కోసం ఐర్లాండ్ పర్యటనకు వెళ్లగా.. ఆ సమయంలో సితాన్షు కోటక్ తాత్కలిక హెడ్ కోచ్‌గా పనిచేశారు. గతేడాది నవంబర్‌లో

# టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్!?

ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన భారత్-ఏ జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేశారు. 1992-93 వరకు సౌరాష్ట్ర తరఫున దేశవాళీ క్రికెట్ ఆడిన 53 ఏళ్ల సితాన్షు.. 130 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 8061 పరుగులు చేశాడు. ఇందులో 15 శతకాలు, 55 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతని బ్యాటింగ్ యావరేజ్ 41.76 ఉండటం విశేషం. సౌరాష్ట్ర జట్టుకు సారథిగా వ్యవహరించిన సితాన్షు కోటక్.. రిటైర్మెంట్ అనంతరం కోచ్‌గా తన రెండో ఇన్నింగ్స్ ను ప్రారంభించాడు. సౌరాష్ట్ర హెడ్ కోచ్‌గా పనిచేసిన అతను అనంతరం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో బ్యాటింగ్ కోచ్‌గా చేరాడు. గత నాలుగేళ్లుగా ఇండియా-ఏ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

బంగ్లాదేశ్, సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా పర్యటనల్లో భారత్-ఏ జట్టును పర్యవేక్షించాడు. ఐపీఎల్ 2017లో గుజరాత్ లయన్స్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గానూ సేవలందించాడు. 'ఇండియా బ్యాటింగ్ కోచ్ పదవి కోసం సితాన్షు కోటక్ పేరును పరిశీలించాం. ఫిబ్రవరి జరిగే ఛాంపియన్స్ ట్రోఫీతోనే అతను బ్యాటింగ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఈ విషయమై బీసీసీఐ త్వరలోనే అధికారిక ప్రకటన చేయనుంది. గత రెండు సిరీస్‌ల్లో టీమిండియా బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. సీనియర్లు కూడా బ్యాటింగ్‌లో తడబడుతున్నారు. బ్యాటింగ్ పాయింట్ ఆఫ్ వ్యూలో టీమిండియా సపోర్ట్ స్టాఫ్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.'అని ఓ అధికారి పేర్కొన్నాడు.ప్రస్తుతం టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ వ్యవహరిస్తుండగా.. బౌలింగ్ కోచ్‌గా మోర్నీ మోర్కెల్ పనిచేస్తున్నాడు. ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్, అసిస్టెంట్ కోచ్‌లుగా అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డస్కాటేలు ఉన్నారు. అభిషేక్ నాయర్ రోల్ బ్యాటర్లకు అండగా ఉండటమేనని, గంభీర్ స్పెషలిస్ట్ బ్యాటింగ్ కోచ్‌ను తీసుకోలేదు. దాంతో విక్రమ్ సింగ్ రాథోడ్ అనంతరం టీమిండియాకు స్పెషలిస్ట్ బ్యాటింగ్ కోచ్ లేకుండా పోయాడు.






# తక్షణమే తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నా

## -బోర్డుకు తెలియజేసిన రోహిత్ శర్మ

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తన భవితవ్యంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)కి స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇటీవల పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న రోహిత్ శర్మ.. కెప్టెన్‌గానూ విఫలమవుతున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024 విజయానంతరం రోహిత్.. అటు బ్యాటర్‌గా.. ఇటు కెప్టెన్‌గానూ తడబడుతున్నాడు. శ్రీలంక గడ్డపై వన్డే సిరీస్‌ను కోల్పోవడంతో పాటు సొంతగడ్డపై ఎన్నడూ లేని విధంగా టెస్ట్ సిరీస్‌లో క్లీన్ స్వీప్ అవ్వడం.. ఆసీస్ గడ్డపై బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 1-3తో చేజార్చుకోవడంతో రోహిత్ శర్మపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చివరి 8 టెస్ట్‌ల్లో టీమిండియాకు కావాల్సిన మూడు విజయాలను రోహిత్ అందించలేకపోయాడు. దాంతో భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ దక్కించుకోలేకపోయింది. పేలవ బ్యాటింగ్‌తో ఆసీస్‌తో చివరి టెస్ట్‌కు రోహిత్ శర్మనే స్వయంగా తప్పుకున్నాడు. తుది జట్టు నుంచి తప్పుకున్న టీమిండియా కెప్టెన్‌గానూ రోహిత్ శర్మ గుర్తింపు పొందాడు. పేలవ బ్యాటింగ్, చెత్త కెప్టెన్సీ నేపథ్యంలో రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించాలని అభిమానులు, క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. జట్టు నుంచి తప్పుకొని కుర్రాళ్లకు అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో టీమిండియా పేలవ ప్రదర్శనపై ఇటీవలే బీసీసీఐ సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి రోహిత్ శర్మతో పాటు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హాజరయ్యాడు. జట్టు పేలవ ప్రదర్శనతో పాటు సిరీస్ మధ్యలోనే రవిచంద్రన్ అశ్విన్ తప్పుకోవడం వంటి విషయాలపై బీసీసీఐ వివరణ కోరినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ సమావేశానికి సంబంధించిన వివరాలు ఇప్పటి వరకు అధికారికంగా బయటకు రాలేదు. కానీ అనేక ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌లో కఠిన ఆంక్షలు అమలు చేయాలని గౌతమ్ గంభీర్ బీసీసీఐకి సూచించనట్లు వార్తలు వచ్చాయి. విదేశీ పర్యటనల్లో కుటుంబ సభ్యులను ఎక్కువ రోజులు అనుమతించకూడదని, యో యో టెస్ట్‌ను మళ్లీ నిర్వహించాలని గంభీర్.. బీసీసీఐని కోరినట్లు.. అందుకు బోర్డు అంగీకరించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. మరోవైపు రోహిత్ శర్మ.. ఫ్యూచర్ కెప్టెన్‌ను సిద్ధం చేసుకోవాలని బీసీసీఐకి సూచించినట్లు సమాచారం. తన వల్లే జట్టుకు సమస్యలు ఏర్పడితే.. తక్షణమే తప్పుకోవడానికి సిద్ధంగా ఉన్నానని కూడా రోహిత్ బోర్డుకు తెలియజేసినట్లు ప్రచారం జరుగుతోంది.అలా కాకుండా మరో కెప్టెన్‌ను సిద్ధం చేసే వరకు కూడా జట్టులో కొనసాగేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని రోహిత్ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 అనంతరం సీనియర్ ఆటగాళ్ల భవితవ్యంపై క్లారిటీ రానుంది. ఈ టోర్నీ మెరుగ్గా రాణిస్తే సీనియర్ ఆటగాళ్లు జట్టులో కొనసాగుతారు. అలా కాకుండా పేలవ ప్రదర్శన కనబరిస్తే మాత్రం బీసీసీఐ కఠిన నిర్ణయాలు తీసుకునే ఛాన్స్ ఉంది.

## టెస్టు జట్టుకు కెప్టెన్‌గా పంత్‌ను నియమించే అవకాశం




భారత క్రికెట్‌లో కెప్టెన్సీ అంశం గత కొద్ది రోజులుగా వార్తల్లో నిలుస్తోంది. రోహిత్ శర్మ తర్వాత టెస్టు జట్టుకు కెప్టెన్‌గా ఎవరు వ్యవహరిస్తారనే దానిపై చర్చ సాగుతోంది. చాలా మంది నిపుణులు ఈ బాధ్యత కోసం స్టార్ వికెట్ కీపర్-బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ పేరును కూడా సూచిస్తున్నారు. ఇది జరుగుతుందా లేదా అనేది రాబోయే నెలల్లో మాత్రమే తెలుస్తుంది. కానీ, అంతకుముందే పంత్ ఇప్పటికే జట్టు కమాండ్‌ను పొందాడు. ఇది టీమ్ ఇండియా కాదు. ఢిల్లీ క్రికెట్ జట్టు కమాండ్. అవును, స్టార్ వికెట్ కీపర్ రంజీ ట్రోఫీ తదుపరి మ్యాచ్‌కి ఢిల్లీ క్రికెట్ జట్టు కెప్టెన్సీని పొందాడు. ఈ మ్యాచ్‌కు ఢిల్లీ జట్టును జనవరి 17 శుక్రవారం ప్రకటించనున్నారు. రంజీ ట్రోఫీ గ్రూప్ దశ జనవరి 23 నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో టీమ్ ఇండియాలోని కొంతమంది ఆటగాళ్లు కూడా ఆడబోతున్నారు. ఢిల్లీ వైపు నుంచి పంత్ ఇప్పటికే తన లభ్యత గురించి అసోసియేషన్ అధ్యక్షుడికి తెలియజేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు జట్టుకు సారథి కూడా చేస్తాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఢిల్లీ తన తదుపరి మ్యాచ్‌ని సౌరాష్ట్రతో ఆడాల్సి ఉంది. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం, జనవరి 17, శుక్రవారం, ఢిల్లీ, డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ సెలక్షన్ కమిటీ ఈ మ్యాచ్ కోసం జట్టును ప్రకటిస్తుంది. నివేదికలో, ఢిల్లీ, డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధికారిని ఉటంకిస్తూ, ఈ సమావేశంలోనే పంత్ పేరు ఆమోదించబడుతుందని చెబుతున్నారు. ఈ సమయంలో, 38 మంది ఆటగాళ్లతో కూడిన జట్టులో ఈ మ్యాచ్ కోసం జట్టును ఎంపిక చేస్తారు. ప్రస్తుతం ఈ జట్టును తదుపరి మ్యాచ్‌కు మాత్రమే ఎంపిక చేస్తున్నారు. ఆ తర్వాత కూడా ఢిల్లీ గ్రూప్ దశలో చివరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. కానీ, అందులో పంత్ ఆడే అవకాశం లేదు. విరాట్ కోహ్లీ విషయానికి వస్తే, ఇప్పటి వరకు స్టార్ బ్యాట్స్‌మెన్ నుంచి డీడీసీఏ ఎలాంటి అప్‌డేట్‌ను అందుకోలేదు. పంత్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి కోహ్లీ ఈ మ్యాచ్‌కు అందుబాటులోకి వస్తాడా లేదా అన్నది అందరి దృష్టి కోహ్లీపైనే ఉంది. అలాగే, ఇటీవల రోహిత్ శర్మ ముంబై రంజీ జట్టుతో ప్రాక్టీస్ చేశాడు. అతను కూడా తదుపరి మ్యాచ్‌లో పాల్గొనవచ్చని సూచించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో జట్టులో భాగమైన కోహ్లీలాగే యశస్వి జైస్వాల్ (ముంబై), శుభ్‌మన్ గిల్ (పంజాబ్) తమ తమ జట్లతో ఆడేందుకు అంగీకరించారు.

## ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో అల్కరాజ్ జోరు

### మూడో రౌండ్‌కు దూసుకెళ్లిన అల్కరాజ్

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాజ్ జోరు కొనసాగుతోంది. టైటిల్ ఫేవరేట్లలో ఒకడైన అల్కరాజ్ మూడో రౌండ్‌కు దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన సెకండ్ రౌండ్‌లో అల్కరాజ్ 6-0, 6-1, 6-4 తేడాతో జపాన్ ప్లేయర్ నిషియోకాను ఓడించాడు. అల్కరాజ్ ఆధిపత్యం ముందు నిషియోకా తేలిపోయాడు. మూడో సెట్‌లో కాస్త పోటీ ఇచ్చినా.. అల్కరాజ్ జోరు ముందు నిలవలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో అల్కరాజ్ 14 ఏస్‌లు, 36 విన్నర్లు కొట్టాడు. మరో హాట్ ఫేవరేట్ ప్లేయర్, సెర్బియా స్టార్ నొవాక్ జకోవిచ్ కూడా మూడో రౌండ్‌కు అర్హత సాధించాడు. ఏడో సీడ్ జకోవిచ్ మరోసారి ఓ సెట్‌ను కోల్పోయినా తర్వాతి సెట్లలో విజయం సాధించి ముందంజ వేసాడు. బుధవారమే జరిగిన రెండో రౌండ్‌లో జకోవిచ్ 6-1, 6-7(4), 6-3, 6-2 తేడాతో జైమీ ఫారియా(పోర్చుగల్)పై విజయం సాధించాడు. పదునైన సర్వీసులు చేసిన జకోవిచ్.. ఈ మ్యాచ్‌లో 14 ఏస్‌లతో పాటు 33 విన్నర్లు కొట్టాడు. ప్రత్యర్థి 6 డబుల్ ఫాల్ట్‌లు, 52 అనవసర తప్పిదాలు చేయడం జకోవిచ్‌కు కలిసొచ్చింది. కెరీర్‌లో జకోవిచ్‌కు ఇది 430వ మ్యాచ్. దాంతో అత్యధిక గ్రాండ్‌స్లామ్ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా అతను చరిత్ర సృష్టించాడు. మరో మ్యాచ్‌లో రెండో సీడ్ జ్వెరెవ్(జర్మనీ) 6-1, 6-4, 6-1 తేడాతో మార్టినెజ్(స్పెయిన్)ను ఓడించాడు. చెక్ ఆటగాడు మెన్సిక్ 6-2, 3-6, 6-1, 6-4 తేడాతో నార్వే ప్లేయర్, ఆరో సీడ్ రూడ్‌ను ఓడించాడు. టామీ పాల్(అమెరికా) 6-7(3/7), 6-0,6-3,6-1 తేడాతో జపాన్ ప్లేయర్ నిషికోరిపై విజయం సాధించాడు. పారిస్ ఒలింపిక్స్ 2024 మహిళల విజేతగా నిలిచిన చైనా స్టార్, ఐదో సీడ్ కిన్వెన్ జెంగ్‌కు బిగ్ షాక్ తగిలింది. జర్మనీకి చెందిన 36 ఏళ్ల లారా సిగెమండ్ 7-6(3), 6-3తో 22 ఏళ్ల జెంగ్‌ను చిత్తుచేసింది. మిగతా క్రీడాకారిణుల్లో టాప్ సీడ్ సబలెంక 6-3, 7-5తో బౌజాసపై, మూడో సీడ్ గాఫ్ 6-3, 7-5తో బురేజ్‌పై, ఏడో సీడ్ పెగులా 6-4, 6-2తో మెర్టెన్స్‌పై, మాజీ నెంబర్‌వన్ నవోమి ఒసాక 1-6, 6-1, 6-3తో ముచోవాపై గెలిచి మూడో రౌండ్‌కు అర్హత సాధించారు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లు రోహన్ బోపన్న, యుకీ భాంబ్రీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. బుధవారం జరిగిన ఆరంభ రౌండ్లో బోపన్న-నికోలస్ ద్వయం 5-7, 6-7(5)తో మార్టినెజ్-మునార్ జోడీ చేతిలో ఓడింది. భాంబ్రీ-అల్బానో ఒలివెట్టి జోడీ 2-6, 6-7(7)తో ట్రిస్టన్-ఆడమ్ చేతిలో ఖంగుతిన్నది.



# నిలకడగా రాణిస్తున్న పడిక్కల్

## -ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో స్థానానికి ఎదురుచూపు



ఛాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీ ప్రారంభానికి కేవలం నెల రోజుల సమయం మాత్రమే ఉంది. దేశవాళీ వేదికగా జరిగిన విజయ్ హజారే టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబర్చిన కొందరు ఆటగాళ్లు ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో స్థానం కోసం కన్నేశారు. వారిలో కర్ణాటకకు చెందిన యువ ప్లేయర్ దేవదత్ పడిక్కల్ ఒకడిగా నిలిచాడు. ఈ విజయ్ హజారే టోర్నీలో దేవదత్ పడిక్కల్ అద్భుత ప్రదర్శనను కొనసాగించాడు. ఆస్ట్రేలియాతో టెస్ట్ సిరీస్ తర్వాత, పడిక్కల్ కర్ణాటక జట్టులో చేరి క్వార్టర్ ఫైనల్, సెమీ-ఫైనల్స్ ఆడాడు. ఈ మ్యాచ్‌ల్లో అద్భుత బ్యాటింగ్‌ను కనబరుస్తూ కర్ణాటక జట్టు ఫైనల్స్‌లోకి ప్రవేశించడంలో కీలక పాత్ర పోషించాడు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా దేవదత్ పడిక్కల్ కర్ణాటక జట్టులో చేరాడు. ఈ క్రమంలో వడోదరతో జరిగిన కీలక మ్యాచ్‌లో రంగంలోకి దిగిన పడిక్కల్ 102 పరుగులతో మెరిశాడు. సెమీఫైనల్ మ్యాచ్ లోనూ బ్యాటింగ్ ప్రారంభించిన పడిక్కల్ 86 పరుగులు చేశాడు. ఈ అద్భుత బ్యాటింగ్‌తో కర్ణాటక జట్టును ఫైనల్‌కు చేర్చడంలో యువ బ్యాట్స్‌మెన్ సక్సెస్ అయ్యాడు. దేవదత్ పడిక్కల్ వన్డే ఫార్మాట్‌లో అదరగొట్టే బ్యాట్స్‌మెన్ అని చెబుతుంటారు. లిస్ట్-ఎ క్రికెట్‌లో ఈ యువ బ్యాటర్ సాధించిన పరుగులే ఇందుకు నిదర్శనం. 2019లో లిస్ట్-ఎ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన దేవదత్ పడిక్కల్ ఇప్పటివరకు 31 ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఈ క్రమంలో అతను 9 సెంచరీలు, 12 అర్ధ సెంచరీలు చేశాడు. అంటే పడిక్కల్ 31 ఇన్నింగ్స్‌ల్లో 21 సార్లు 50ం స్కోర్లు నమోదు చేశాడు. అలాగే, 82.52 సగటుతో పరుగులు చేసిన దేవదత్ పడిక్కల్ ఇప్పటివరకు 2063 పరుగులు సాధించాడు. దేవదత్ పడిక్కల్ గత కొన్నేళ్లుగా ఇలాంటి అద్భుతమైన ప్రదర్శనలతో టీమిండియా తలుపులు తడుతున్నాడు. అయితే, గత 5 ఏళ్లుగా పడిక్కల్‌కు వన్డే జట్టులో చోటు దక్కకపోవడం ఆశ్చర్యకరం. దేవదత్ పడిక్కల్ 2018లో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తొలిసారి బ్యాటింగ్ చేశాడు. అప్పటి నుంచి అతను 41 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి మొత్తం 4664 పరుగులు చేశాడు. ఈ కాలంలో అతను 6 సెంచరీలు, 17 అర్ధసెంచరీలు చేశాడు. 2019లో లిస్ట్-ఎ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన పడిక్కల్ 32 మ్యాచ్‌ల్లో 31 ఇన్నింగ్స్‌లు ఆడి 91.20 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 2063 పరుగులు చేశాడు. అలాగే, అతను 2021 విజయ్ హజారే టోర్నమెంట్‌లో వరుసగా 4 సెంచరీలు సాధించాడు. ప్రస్తుతం, అద్భుతమైన ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ భారత్ వన్డే జట్టులో అవకాశం కోసం చూస్తున్నాడు.

# టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా సిద్ధంగా ఉన్నా

## ఇంగ్లండ్ దిగ్గజ బ్యాట్స్‌మెన్ కెవిన్ పీటర్సన్

ఆస్ట్రేలియా టూర్‌లో ఘోర పరాజయం తర్వాత టీమిండియాలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుత కోచింగ్ సెటప్‌పై బీసీసీఐ సంతోషంగా లేదనే వార్తలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు, టీమ్ ఇండియాకు ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లు కూడా ఉన్నారు. వీరి పనితో బీసీసీఐ సంతృప్తి చెందలేదు. అందుకే ఇప్పుడు బ్యాటింగ్ కోచ్ కోసం వెతుకుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. బ్యాటింగ్ కోచ్ బాధ్యత ఎవరు తీసుకుంటారనేది ప్రశ్నగా మారింది. అయితే, ఈ పాత్రను పోషించేందుకు ఇంగ్లండ్ మాజీ బ్యాట్స్‌మెన్ కెవిన్ పీటర్సన్ సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాడు. టీమిండియా బ్యాటింగ్ కోచ్‌గా తాను అందుబాటులో ఉన్నానని ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ తెలిపాడు. కెవిన్ పీటర్సన్ తన సంచలన ప్రకటనలకు ప్రసిద్ధి చెందాడు. %శ% లో చాలా చురుకుగా ఉంటాడు. టీమిండియా బ్యాటింగ్ కోచ్‌ని నియమించుకోబోతోందని సోషల్ మీడియాలో వార్తలు వ్యాపించాయి. ఈ మాజీ బ్యాట్స్‌మెన్ తాను అందుబాటులో ఉన్నానంటూ రాసుకొచ్చాడు. పీటర్సన్ చేసిన ఈ ప్రకటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కెవిన్ పీటర్సన్ దక్షిణాఫ్రికాలో జన్మించాడు. అయితే, అతను ఇంగ్లాండ్ తరపున 104 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు. అందులో అతను 47 కంటే ఎక్కువ సగటుతో 8181 పరుగులు చేశాడు. అతని బ్యాట్ నుంచి 23 సెంచరీలు, 55 హాఫ్ సెంచరీలు వచ్చాయి. ఇది కాకుండా, పీటర్సన్ ఇంగ్లాండ్ తరపున 136 %ాణ×% మ్యాచ్‌లు ఆడాడు. అందులో అతను 40 కంటే ఎక్కువ సగటుతో 4440 పరుగులు చేశాడు. పీటర్సన్ అంతర్జాతీయ వన్డేల్లో 9 సెంచరీలు సాధించాడు. పీటర్సన్ 37.93 సగటుతో 1176 పరుగులు చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 141 కంటే ఎక్కువ. పీటర్సన్ మూడు ఫార్మాట్లలో అద్భుతమైన బ్యాట్స్‌మెన్ అని స్పష్టంగా చెప్పవచ్చు. ఇది కాకుండా, పీటర్సన్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 49.76 సగటుతో 16522 పరుగులు చేశాడు. ఇందులో 50 సెంచరీలు ఉన్నాయి. లిస్ట్ ఏలో అతని పేరు మీద 15 సెంచరీలు ఉన్నాయి. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పీటర్సన్ అత్యుత్తమ స్కోరు 355 పరుగులు. కెవిన్ పీటర్సన్ గొప్పదనం ఏమిటంటే, అతను పేస్, స్పిన్ బౌలర్లకు వ్యతిరేకంగా చాలా విజయవంతమయ్యాడు. స్పిన్నర్లను ఆడే టెక్నిక్ రాహుల్ ద్రవిడ్ స్వయంగా నేర్పించాడు. ఈ ఏడాది ఐపీఎల్ తర్వాత, ఇంగ్లండ్ టూర్‌లో టీమిండియా ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను ఆడాల్సి ఉంది. ఇందులో పీటర్సన్ కీలక పాత్ర పోషించగలడు. ఇంగ్లండ్‌లో చాలా కాలం గడిపిన అతను అక్కడి వాతావరణం, పిచ్ స్వభావం, బౌలర్ల మైండ్‌సెట్‌ని అర్థం చేసుకున్నాడు. సహజంగానే, విరాట్ కోహ్లీ వంటి బ్యాట్స్‌మెన్‌లకు పీటర్సన్ సహాయం చేయగలడు.





# ఫోజ్ కొట్టడంలో కేతిక తగ్గేదేలే

కేతిక ఇదిగో ఇలా రిసార్ట్ లాంజ్‌లో తీరిగ్గా కెమెరాలకు ఫోజులిచ్చింది. రిలాక్స్‌డ్‌గా భంగిమలో కూచున్న కేతిక థై సొగసులను ఎలివేట్ చేసింది. ఆకాశ్ పూరి 'రొమాంటిక్' చిత్రంతో కథానాయికగా పరిచయమైన ఉత్తరాది బ్యూటీ కేతిక శర్మ తనదైన అందం నటనతో మైమరిపించింది. నాగశౌర్య 'లక్ష్య' , వైష్ణవ్ తేజ్ సరసన 'రంగ రంగ వైభవంగా' చిత్రాలలోను నటించింది. ఇటీవల నితిన్ నటించిన రాబిన్‌హుడ్ లో అధీ ధా సర్‌ప్రైజ్ అనే ప్రత్యేక పాటలో నర్తించింది. సినిమాలు, కెరీర్ సంగతి అటుంచితే కేతికకు సోషల్ మీడియాల్లో అద్భుతమైన ఫాలోయింగ్ ఉంది. ఈ బ్యూటీ అందచందాలు, నటప్రతిభకు ప్రత్యేకించి ఫాలోవర్స్ ఉన్నారు. ఇన్ స్టాలో నిరంతర ఫోటోషూట్లతోను ఫ్యాన్స్ ని ఆకర్షిస్తూనే ఉంది. కేతిక తాజాగా ఇన్ స్టాలో ఓ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ని షేర్ చేసింది. కేతిక ఇదిగో ఇలా రిసార్ట్ లాంజ్‌లో తీరిగ్గా కెమెరాలకు ఫోజులిచ్చింది. రిలాక్స్‌డ్‌గా భంగిమలో కూచున్న కేతిక థై సొగసులను ఎలివేట్ చేసింది. ఈ ఫోటోషూట్ కి 'మంత్రము' అనే హ్యాష్ ట్యాగ్‌ని జోడించింది. కేతిక మంత్రముగ్ధం చేసే అందచందాలకు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా షేర్ అవుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. కేతిక తదుపరి తెలుగు తమిళంలో కథలు వింటోంది. ప్రత్యేక గీతంలో నర్తించిన 'రాబిన్ హుడ్' త్వరలో విడుదల కానుంది. ఎం రాజేష్ దర్శకత్వంలో ఓ సినిమాకి సంతకం చేసింది. కానీ అధికారికంగా వివరాలు వెల్లడి కావాల్సి ఉంది



# చీరకట్టులో అందాల రాశి..

స్టన్నింగ్ లుక్స్ టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమల్లోనూ రాశి తన అందం, ప్రతిభతో ఆకట్టుకుంది. %దీఎ: ఎబజూఖుఎఱ ఇవంఎ ఎ 14 జీుఅ 2025 6:00ాావీ% రాశి ఖన్నా.. టాలీవుడ్‌లో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి. 2014లో విడుదలైన ఊహలు గుసగుసలాడే సినిమాతో మొదలైన అమ్మడి ప్రయాణం ఆ తరువాత హడావుడిగానే కొనసాగింది. హీరోయిన్ గా మొదటి సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో, రాశి ఖన్నా తర్వాత వరుస అవకాశాలను సొంతం చేసుకున్నారు. సుప్రీం, జిల్, తొలిప్రేమ వంటి చిత్రాల్లో నటించి, నటనలో తనకంటూ ఓ ముద్ర వేశారు. టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమల్లోనూ రాశి తన అందం, ప్రతిభతో ఆకట్టుకుంది. అలాగే బాలీవుడ్‌లో కూడా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న అమ్మడు.. మద్రాస్ కేఫ్ వంటి హిందీ చిత్రాలతో పాటు, తమిళ సినిమాల్లోనూ మంచి అవకాశాలను దక్కించుకుంది. ఆమె కెరీర్‌లో బెస్ట్ సినిమాలలో ఇమైక్క నొడిగల్ తమిళ సినిమా. ఈ చిత్రంలో ఆమె నటనకు విశేషమైన ప్రశంసలు లభించాయి. రాశి ఖన్నా తన సినీ ప్రయాణంలో గ్లామర్ పాత్రలతో పాటు, డిఫరెంట్ కంటెంట్ ఉన్న పాత్రలను కూడా ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. తాజాగా రాశి ఖన్నా పొంగల్ సందర్భంగా విషెస్ అందిస్తూ ఎర్రని చీరలో మెరిసిపోతూ దిగిన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. సంప్రదాయ వస్త్రధారణలో స్టైలిష్‌గా కనిపిస్తూ, రాశి తన అందంతో అభిమానులను ఎట్రాక్ట్ చేసింది. ఈ చీరకు తగ్గట్టు మెరిసే బ్లౌజ్ ధరించి, సింపుల్ జువెలరీతో స్టన్నింగ్ లుక్‌లో ఆమె కనిపించారు. సూర్య కాంతి పడ్డ లైటింగ్‌లో, ఆమె ముఖ కాంతి మరింత అందంగా మెరవడం నెటిజన్లను విపరీతంగా ఆకర్షించింది. ఇక రాశి ఖన్నా ఫోటోలకు సంబంధించిన ఈ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆమె అందంగా కనిపించే ఈ ఫోటోలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. "కణ్మణి" అని క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ ఫోటోలకు కలెక్షన్ లక్షల్లో లైకులు వచ్చాయి. ఈ చీరలో ఆమె చూపించిన ఆహార్యం, ఆమె వ్యక్తిత్వాన్ని మరింత హైలైట్ చేస్తూ, ట్రెడిషనల్ లుక్‌లో కూడా ఆమె ఎంత అందంగా ఉంటారో చూపించారు. ప్రస్తుతం రాశి ఖన్నా పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒక హిందీ సినిమాతో పాటు, తమిళంలో కూడా ఓ ప్రముఖ హీరోతో సినిమా చేస్తుంది. అంతేకాకుండా, తెలుగులో సిద్ధు జొన్నలగడ్డతో తెలుసు కదా అనే సినిమా లైన్ లో ఉంది. ఇక అమెజాన్ ప్రైమ్ కోసం రూపొందుతున్న ఓ వెబ్‌సిరీస్‌లో కూడా రాశి కీలక పాత్ర పోషిస్తున్నారు

# ఆసక్తికరంగా 'ఘాటి' దేశీరాజు గ్లింప్స్

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిష్ డైరెక్షన్‌లో సీనియర్ నటి అనుష్క శెట్టి నటిస్తున్న తాజా చిత్రం 'ఘాటి'. ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు దేశీరాజు అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రకు సంబంధించిన గ్లింప్స్ ను చిత్రం యూనిట్ నిన్న విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసింది. ఈ గ్లింప్స్ ను యాక్షన్, బైక్ స్టంట్స్ తో ఆసక్తికరంగా మలిచారు. చివరలో అనుష్క కూడా బైక్ నడుపుతూ కనిపించారు. ఇక ఈ చిత్రంలో అనుష్క పాత్ర కూడా చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని ఇప్పటికే విడుదలైన ఈ మూవీ టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఈ సినిమాకు నాగవెల్లి విద్యా సాగర్ సంగీతం అందిస్తుండగా యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. 'ఘాటి' మూవీ ఏప్రిల్ 18న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఒకేసారి విడుదల కానుంది






# అనసూయ సంక్రాంతి లుక్స్.. చీరలో ఇలా క్యూట్ క్యూట్‌గా..

సొగసైన బ్లౌజ్ డిజైన్ ఆమె అందాన్ని మరింతగా హైలైట్ చేసింది. చీరతో బ్యూటీఫుల్ ఏంజెల్ లా కనిపిస్తూ, ఆమె సంక్రాంతి మూడ్‌ను ఫోటోల ద్వారా పూర్తి వివరంగా తెలియజేసింది. అనసూయ భరద్వాజ తెలుగులో అత్యంత క్రేజ్ అందుకున్న యాంకర్ లలో ఒకరు. అలాగే నటిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంది. తన అద్భుతమైన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో కేవలం యాంకరింగ్‌లోనే కాకుండా, సినిమాల్లో కూడా ఆమె సత్తా చాటింది. అనసూయ నటించిన 'రంగస్థలం'లోని రంగమ్మత్త పాత్ర ఆమెకు బలమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. ఆ తర్వాతి కాలంలో ఆమె వివిధ పాత్రల్లో కనిపిస్తూ ప్రేక్షకులను మెప్పించింది. ముఖ్యంగా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలతోనూ తన యాక్టింగ్ టాలెంట్‌ను ప్రదర్శించింది. అనసూయ కెరీర్‌లో వివిధ వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ మంచి అవకాశాలు అందుకుంది. ఆమె తన సినీ కెరీర్ ను జెట్ స్పీడ్ లో కొనసాగిస్తూనే సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ, అభిమానులతో తన వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటుంది. అందుకే, ఆమె పోస్టులు నెట్టింట్లో చర్చనీయాంశమవుతుంటాయి. ఇటీవల అనసూయ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న పతంగుల ఫోటోలు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చీర కట్టులో సంప్రదాయ శైలిని ప్రదర్శిస్తూ, పతంగుల్ని చేతబట్టి ఆమె ఇచ్చిన హావభావాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఫోటోల్లో అనసూయ చీర కట్టుకు జతగా స్టైలిష్ లుక్స్, అందమైన మేకప్‌తో మరింత మెరిసిపోయింది. సొగసైన బ్లౌజ్ డిజైన్ ఆమె అందాన్ని మరింతగా హైలైట్ చేసింది. చీరతో బ్యూటీఫుల్ ఏంజెల్ లా కనిపిస్తూ, ఆమె సంక్రాంతి మూడ్‌ను ఫోటోల ద్వారా పూర్తి వివరంగా తెలియజేసింది. అనసూయ ఫోటోషూట్‌కి నెటిజన్ల నుంచి కూడా మంచి స్పందన లభిస్తోంది. పతంగుల నేపథ్యంలో ఆమె ఇచ్చిన పొజ్‌లు, తన చిరునవ్వుతో అందాన్ని మరింత మెరుగు పరుస్తున్నాయి. చీరకట్టులో నేటివిటీ టచ్ చూపిస్తూ, హాయిగా కనిపిస్తున్న అనసూయ కొత్త తరహా ఫోటోషూట్‌కు సంబంధించిన ఫోటోలు కాస్త వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం అనసూయ సినిమాల ప్రాజెక్టులతో కూడా బిజీగా ఉంది. ఆమె నటిస్తున్న ప్రధాన ప్రాజెక్ట్‌లలో 'ఫ్లాష్' ఒకటి. ఈ సినిమాలో ఆమె పాత్రకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని తెలుస్తోంది. అంతేకాకుండా మరికొన్ని వెబ్ సిరీస్‌లు, షోస్‌కి కూడా అనసూయ తన ఆమోదాన్ని తెలిపినట్లు సమాచారం. వెండితెరపై ఆమె మరింత విభిన్న పాత్రల్లో కనిపించేందుకు అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు



# పొట్టి గౌనులో పూనమ్ పాప అల్ట్రా గ్లామర్ ట్రీట్!

సోషల్ మీడియాలో తన అందంతో అభిమానులను అలరిస్తూ అవకాశాల కోసం వెయిట్ చేస్తోంది. పూనమ్ బాజ్వా కెరీర్ తొలి రోజుల్లోనే తన అందం నటనతో ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. మోడలింగ్ ద్వారా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన పూనమ్, ముఖ్యంగా తెలుగు, తమిళ, మలయాళ సినిమాలలో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. 'మొదటి సినిమా' అనే సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చిన అమ్మడికి మొదట్లోనే మంచి అవకాశాలను అందుకుంది. అయితే, మొదట్లో ట్రెడిషనల్ పాత్రలకే ఎక్కువగా పరిమితమవడం వల్ల స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదగలేకపోయింది. మలయాళ చిత్రాలలో ఆమెకు మంచి అవకాశాలు లభించాయి, ముఖ్యంగా చిన్నా టౌన్ వంటి చిత్రాలు ఆమెకు గుర్తింపు తెచ్చాయి. పూనమ్ కెరీర్‌లో కొన్ని విరామాల తరువాత సెకండ్ ఇన్నింగ్స్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. సోషల్ మీడియాలో తన అందంతో అభిమానులను అలరిస్తూ అవకాశాల కోసం వెయిట్ చేస్తోంది. సోషల్ మీడియాలో పూనమ్ బాజ్వా హాట్ టాపిక్‌గా నిలుస్తోంది. ఇటీవల విడుదలైన ఫోటోలలో, ఆమె తెల్లని చిన్న డ్రెస్‌లో ఎంతో ఆహ్లాదకరంగా కనిపించింది. ఒంపుసొంపుల డ్రెస్‌కి సరిపడే కాటాయ్ గ్లాసెస్‌తో బీచ్ బ్యాక్‌డ్రాప్ లో కనిపించిన ఈ లుక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మినిమల్ మెకప్‌తో తన సహజ అందాన్ని చూపిస్తూ ఫ్యాన్స్ నుండి ప్రశంసలు అందుకుంది. ఈ ఫోటోలలో పూనమ్ ఒదిగిన తళుకుల డ్రెస్ ఆమె గ్లామర్‌ను మరో మెట్టు ఎక్కించింది. సముద్ర తీరంలో సూర్యాస్తమయం నడుమ ఆమె తీసుకున్న స్టైలిష్ పోజులు నెటిజన్లను మైమరపించాయి. ప్రత్యేకంగా ఆమె ఫిట్నెస్ మెయింటెనెన్స్ ప్రశంసలందుకుంది. ఈ ఫోటోలకు లైక్స్, కామెంట్స్ కురుస్తున్నాయి. ప్రస్తుతం పూనమ్ పెద్దగా అవకాశాలు పొందలేదు. అయినప్పటికీ, కొత్త తరహా పాత్రల కోసం ప్రయత్నాలు చేస్తోంది. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆమెకు మరిన్ని అవకాశాలు వస్తాయో లేదో చూడాలి

